షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
RNI : APTEL / 2023 / 89152
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
1st Year Happy Work Anniversary.
Good for Health
Best for Readers
సంపుటి : 2 సంచిక : 319 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ ఆదివారం 16 నవంబర్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు
VOLUME : 02 ISSUE : 319 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Sunday 16 November 2025 PAGES : 8 PRICE : 3/-

## ఇంధన రంగానికి సైబర్ కవచం.. వరల్డ్ ఎకనమిక్ ఫోరంతో ఏపీ ప్రభుత్వం కీలక ఒప్పందం

**ఏపీ ఇంధన రంగంలో కొత్త శకం**

**విద్యుత్ వ్యవస్థల భద్రతకు ప్రత్యేక కేంద్రం**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 15)**



ఇంధన భద్రత, సైబర్ రక్షణ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చారిత్రాత్మక ముందడుగు వేసింది. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యుత్ వ్యవస్థలను పటిష్ఠం చేయడంతో పాటు, వాటికి సైబర్ దాడుల నుంచి రక్షణ కల్పించడమే లక్ష్యంగా 'సెంటర్ ఫర్ ఎనర్జీ సైబర్ రెజిలియన్స్ సెంటర్' ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. విశాఖపట్నంలో శనివారం జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం, వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) మధ్య ఈ కీలక ఒప్పందం కుదిరింది. ఈ కేంద్రం ఏర్పాటు ద్వారా ఇంధన రంగంలో సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే, సైబర్ భద్రతా ప్రమాణాలను పెంచాలని ప్రభుత్వం -మిగతా 2లో

## పెట్టుబడులే కాదు.. ఆలోచనల్ని పంచుకున్నాం

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 15)**




సీఐఐ సదస్సు ద్వారా రాష్ట్రానికి రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని సీఎం చంద్రబాబు తెలిపారు. పెట్టుబడుల ద్వారా పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. సీఐఐ సదస్సు వాలిడిటరీ సెషన్‌లో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. దావోస్ తరహాలో ఈ సెషన్లు నిర్వహించగలిగామన్నారు. కేవలం పెట్టుబడులనే కాదని, ఆలోచనల్ని కూడా పంచుకోగలిగామన్నారు. "60 దేశాల ప్రతినిధులు సీఐఐ భాగస్వామ్య సదస్సుకు హాజరయ్యారు. 700కి పైగా బీ టూ బీ సమావేశాలు జరిగాయి. వికసిత్ భారత్-2047 లక్ష్యాలకు అనుగుణంగా పాలసీల రూపకల్పన చేశాం. పరిశ్రమలకు అనుగుణంగా కార్మిక, ఆర్థిక, ఇన్‌ఫ్రా సంస్కరణలు చేపడుతున్నాం. పారిశ్రామిక ప్రోత్సాహకాలకు ఎస్క్రో ఖాతాను నిర్వహిస్తున్నాం. వచ్చే ఏడాది పెట్టుబడుల సదస్సుకూ మీరంతా హాజరుకావాలి. పారిశ్రామికవేత్తలు తరచూ ఏపీలో పర్యటించాలి" అని సీఎం కోరారు. ఈ సందర్భంగా సీఐఐ సదస్సుకు హాజరైన అతిథులకు సీఎం జ్ఞాపికలు అందించారు.అంతకుముందు శ్రీసిటీలో మరికొన్ని యూనిట్లను చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించారు. ఇక్కడ 12 ప్రాజెక్టుల ఏర్పాటుకు వివిధ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నారు. ఈ పెట్టుబడుల ద్వారా 12,365 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని చంద్రబాబు తెలిపారు. సదస్సు ప్రాంగణం నుంచే రేమాండ్ ప్రాజెక్టులకు సీఎం చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రేమాండ్ గ్రూప్ ఎండీ గౌతమ్ మైనీ పాల్గొన్నారు. రూ.1201 కోట్ల పెట్టుబడులతో రాష్ట్రంలో 3 ప్రాజెక్టులను రేమాండ్ గ్రూప్ ఏర్పాటు చేయనుంది.

## బిహార్ ఎన్నికల పాఠాలివే స్టాలిన్ కీలక వ్యాఖ్యలు



**(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,నవంబర్ 15)**

బిహార్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి తిరుగులేని విజయం సాధించింది. 202 సీట్లు తన ఖాతాలో వేసుకోగా.. మహాగఠ్‌బంధన్ కూటమి తీవ్ర పరాజయం పాలైంది. ఈ ఓటమిపై తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఫలితంతో ఇండియా కూటమి ఎంతో నేర్చుకోవాలన్నారు. బిహార్ ఎన్నికల ఫలితాలు అందరికీ పాఠమంటూ స్టాలిన్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. నిర్ణయాత్మక విజయం సాధించిన సీఎం నీతీశ్‌కుమార్‌కు ఆయన అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో విజయం కోసం అవిశ్రాంతంగా పోరాడిన ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్‌కు కూడా శుభాకాంక్షలు తెలిపారు. సంక్షేమాలు, సామాజిక, సైద్ధాంతిక -మిగతా 2లో

## ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించడం నా అదృష్టం

**రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధికి త్వరలో టెండర్లు పిలుస్తామని ప్రకటన**

**మొంథా తుపాను నష్టంపై కేంద్ర ప్రభుత్వంతో చర్చించానని వెల్లడి**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 15)**



ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో ప్రసంగించడం తన అదృష్టంగా భావిస్తున్నానని బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఇటీవల కామన్వెల్త్ మహిళా సదస్సులో ఐదు రోజుల పాటు పాల్గొని తిరిగి వచ్చిన ఆమె ఈరోజు రాజమండ్రిలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పురందేశ్వరి పలు జాతీయ, స్థానిక అంశాలపై స్పందించారు. బీహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం ద్వారా ప్రజలు స్పష్టమైన సందేశం ఇచ్చారని వ్యాఖ్యానించారు.స్థానిక అభివృద్ధి పనుల గురించి వివరిస్తూ, రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు త్వరలోనే టెండర్లు పిలుస్తామని పురందేశ్వరి హామీ ఇచ్చారు. -మిగతా 2లో

## వైకాపాను శాశ్వతంగా తరిమేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి: ప్రత్తిపాటి పుల్లారావు

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 15)**



తిరుమల పరకామణి కేసులో ఫిర్యాదుదారు సతీశ్‌కు కుమార్ హత్య, రాజకీయాల్లో ఆరితేరిన అవినీతిపరుల పనేనని తెదేపా నేత ప్రత్తిపాటి పుల్లారావు ఆరోపించారు. పరకామణి దొంగలే సతీశ్‌కు పొట్టనపెట్టుకున్నారని ప్రజలకు అర్థమైందన్నారు. రక్త సంబంధాల్నే బలిపెట్టిన -మిగతా 2లో

## ముఠాల మూలాలు తేల్చండి.. విశాఖ గోమాంసం ఘటనపై పవన్ కల్యాణ్ సీరియస్

**విశాఖ గోమాంసం నిల్వలపై డిప్యూటీ సీఎం పవన్ సీరియస్**

**ముఠాల మూలాలను వెంటనే తేల్చాలని పోలీసులకు ఆదేశం**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 15)**

విశాఖ నగరంలో భారీ ఎత్తున అక్రమ గోమాంసం నిల్వలు బయటపడిన ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. ఈ దందా వెనుక ఉన్న ముఠాల మూలాలను తక్షణమే వెలికితీయాలని విశాఖ పోలీసులను ఆయన ఆదేశించారు. ఈ వ్యవహారంలో ఎవరి ప్రమేయం ఉన్నా ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఘటన వెలుగులోకి రాగానే ఆయన నేరుగా విశాఖ పోలీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకున్నారు.



ఈ సందర్భంగా డీఆర్ఐ అధికారులు మిత్రా కోల్డ్ స్టోరేజీలో జరిపిన దాడుల్లో 1.89 లక్షల కిలోల గోమాంసాన్ని స్వాధీనం చేసుకుని, -మిగతా 2లో

## తయారీ రంగంలో పెట్టుబడులకు ముందుకురావాలి: రామ్మోహన్ నాయుడు

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 15)**

ప్రయాణికులకు విమానాల్లో అనేక సౌకర్యాలు కల్పిస్తున్నామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఫ్లైబ్రరీ పేరిట పుస్తకాలు అందిస్తున్నామని, ఉడాన్ కేఫ్‌ల ద్వారా తక్కువ ధరకే ఆహారం అందిస్తున్నామని చెప్పారు. విశాఖలో నిర్వహించిన సీఐఐ ముగింపు సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో తయారీరంగంలో అనేక మార్పులు తీసుకొస్తున్నామన్నారు. ఆత్మనిర్భర్ భారత్ ద్వారా తయారీరంగానికి ఎకో సిస్టమ్ అభివృద్ధి చేశామన్నారు. భవిష్యత్‌లో డ్రోన్‌ల వినియోగం భారీగా పెరగబోతోందని చెప్పారు. తయారీ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు మరిన్ని సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.



## కృత్రిమ మేధ మానవాళికి ముప్పు కాదు: నారా లోకేశ్



**(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 15)**

విశాఖలో రెండో రోజు సీఐఐ సదస్సు జరుగుతోంది. ఇందులో భాగంగా 'ఏఐ-భవిష్యత్తులో ఉద్యోగాల' అంశంపై నిర్వహించిన చర్చలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడారు. ప్రతి పారిశ్రామిక విప్లవం ఎక్కువ ఉద్యోగాలు కల్పిస్తుందని తాను నమ్ముతున్నట్లు లోకేశ్ తెలిపారు."ఏఐని అందిపుచ్చుకోవడానికి ఏపీ మూడు విధాలుగా ముందుకెళ్తోంది. పునఃనైపుణ్యం, పునర్నిర్వచించడం, పునఃఊహించడం ద్వారా ముందుకెళ్తున్నాం. మేం నైపుణ్యం అనే ప్లాట్‌ఫామ్‌ని రూపొందించాం. కృత్రిమ మేధ మానవాళికి ముప్పు కాదు.. మానవత్వాన్ని తీర్చిదిద్దుతుంది" -మిగతా 2లో

## సూపర్ స్టార్ కృష్ణ వర్ధంతి సందర్భంగా జగన్ ట్వీట్



**దివంగత నటుడు సూపర్ స్టార్ కృష్ణకు నివాళులర్పించిన వైఎస్ జగన్**

**ఎన్నో ప్రయోగాలు చేసిన సాహసిగా అభివర్ణన**

**ఇండస్ట్రీలో ఎందరికో అండగా నిలిచిన మానవతావాది అని ప్రశంస**

**(షణ్ముఖ వెలుగు, అమరావతి,నవంబర్ 15)**

దివంగత నటుడు, పద్మభూషణ్ సూపర్ స్టార్ కృష్ణ వర్ధంతి సందర్భంగా వైసీపీ అధినేత జగన్ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక సందేశాన్ని పంచుకున్నారు. కృష్ణ కేవలం గొప్ప నటుడే కాదని, తెలుగు సినీ పరిశ్రమకు సరికొత్త మార్గాలు చూపిన గొప్ప ప్రయోగశీలి అని కొనియాడారు. "తెలుగు సినీ పరిశ్రమకు నూతన పంథాలు చూపించి, కోట్లాది మంది అభిమానాన్ని చూరగొన్న గొప్ప నటుడు పద్మభూషణ్ సూపర్ స్టార్ కృష్ణ గారు. ఎప్పుడూ కొత్తదనాన్ని అన్వేషించిన ప్రయోగశీలి ఆయన. తెలుగు సినీ పరిశ్రమలో ఎంతోమందిని ఆదుకున్న గొప్ప మానవతావాది. కృష్ణ గారి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు" అని జగన్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. -మిగతా 2లో

# శ్రీగిరి శ్రీవారికి మేల్ చాట్ వస్త్రాల సమర్పణ



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 15)
ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ఒంగోలుకు చెందిన పులిపాక వెంకట చలపతి, విజయ కుమారి, వెంకట సాయి చైతన్య మేల్ చాట్ వస్త్రాలను సమర్పించారు. ఆలయ అర్చకులు వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం చేయడంతో పాటు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి మేల్ చాట్ వస్త్రాలను సమర్పించిన పులిపాక వెంకట చలపతి కుటుంబ సభ్యులను శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, అర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సివి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి, తదితరులు అభినందించారు.

# 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, నవంబర్ 15)
మండల కేంద్రమైన ఉలవపాడు శాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల వేడుకల్లో భాగంగా శనివారం పుస్తక ప్రదర్శన లి నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో విదార్థులు పాల్గొని గ్రంథాలయంలో ఉన్న పుస్తక సంపదను వీక్షించడం జరిగినది. రేపటి నుండి జరిగే వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొని గ్రంథాలయ వారోత్సవాలను జయప్రదం చేయవలసినదిగా కోరడం జరిగినది. చివరిగా పిల్లలకు స్నాక్స్ అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మొత్తం లి 10 లి మంది విద్యార్థులు పాల్గొనడం జరిగిందని గ్రంథాలయ పాలకుడు డి. కోటేశ్వరరావు తెలిపారు.

# విద్యార్థులు పుస్తక పఠనం పై ఆసక్తి పెంచుకోవాలి

ఎంఈఓ నారాయణరెడ్డి



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, నవంబర్ 15)
కనిగిరి శాఖా గ్రంథాలయం నందు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా రెండవ రోజు పుస్తక ప్రదర్శన నిర్వహించబడినది గ్రంథపాలకుడు షేక్ అహ్మద్ షరీఫ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంనకు ముఖ్యఅతిథిగా కనిగిరి మండల ఎంఈఓ నారాయణరెడ్డి రిబ్బన్ కటింగ్‌తో ప్రారంభించారు. ఎంఈఓ నారాయణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులలో పఠనా శక్తి పెంపొందించుకోవాలని అందుకు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కొన్ని వేల పుస్తకాలను కనిగిరి గ్రంథాలయంలో చదువుటకు సిద్ధంగా ఉన్నాయని వాటిని ఉపయోగ పెట్టుకోవలసిన నైతిక బాధ్యత అందరిపైన ఉందని గ్రంథాలయాలను వినియోగించుకొని మీ యొక్క మేధా శక్తి పెంచుకోవాలని అన్నారు. కనిగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సాంస్కృతిక విభాగ అధ్యక్షుడు షేక్ దయాజ్ భాష మాట్లాడుతూ గ్రంథాలయంలో ఉన్నటువంటి పుస్తకాలను విద్యార్థిని విద్యార్థులు తప్పనిసరిగా చదువుకోవాలని చదవాలిరా ఎన్ని ఆటంకాలు వచ్చినా చదువు లేకపోతే ఈ భవిత పెద్ద సున్నా అంటూ ఒక మంచి గేయాన్ని పాడి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆదిత్య స్కూల్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థులు పాఠకులు పాల్గొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

# ఇంధన రంగానికి సైబర్ కవచం.. వరల్డ్ ఎకనమిక్ ఫోరంతో ఏపీ ప్రభుత్వం కీలక ఒప్పందం

లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, ఇంధన రంగంలో సాంకేతికత వినియోగం ఎంత ముఖ్యమో, సైబర్ రక్షణ కూడా అంతే కీలకమని ఉద్ఘాటించారు. "ప్రపంచమంతా ఇప్పుడు గ్రీన్ ఎనర్జీ వైపు చూస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో 160 గిగావాట్ల హరిత విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలని మేం లక్ష్యంగా పెట్టుకున్నాం. అయితే, విద్యుత్‌ను ఉత్పత్తి చేయడమే కాదు, దానిని ప్రజలకు అతి తక్కువ వ్యయంతో, సురక్షితంగా అందించడం కూడా ప్రభుత్వ బాధ్యత. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక టెక్నాలజీలను ఉపయోగించి విద్యుత్ పంపిణీ, సరఫరా నష్టాలను గణనీయంగా తగ్గించాలి. అప్పుడే ఈ రంగంలో సుస్థిరత సాధ్యమవుతుంది" అని ఆయన వివరించారు. వ్యవసాయం నుంచి పరిశ్రమల వరకు ప్రతి రంగానికి విద్యుత్ అత్యవసరమని, పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా వికేంద్రీకృత ఉత్పత్తి విధానాలపై దృష్టి సారించామని చంద్రబాబు తెలిపారు. "ఎక్కడికక్కడే విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునేలా ప్రణాళికలు రచిస్తున్నాం. తద్వారా ట్రాన్స్‌మిషన్ నష్టాలను తగ్గించి, ప్రజలకు మరింత ప్రయోజనం చేకూర్చవచ్చు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద రాష్ట్రంలో సోలార్ రూఫ్ టాప్ ప్రాజెక్టులను వేగవంతం చేశాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చి వినియోగాన్ని పెంచిన అనుభవం మాకుంది. ఇప్పుడు అదే స్ఫూర్తితో, భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా ఇంధన వ్యవస్థలను తీర్చిదిద్దుతున్నాం" అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు డబ్ల్యూఈఎఫ్ ముందుకు రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. తక్కువ వ్యయంతో నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తిపై చంద్రబాబు దృష్టి సారించారు: మంత్రి నారా లోకేశ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతతో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళుతోందన్నారు. "విశాఖకు 6 గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్‌ను తీసుకురావాలన్న మా కల సాకారమైంది. అయితే, ఇలాంటి డేటా సెంటర్లకు నిరంతరాయంగా, తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యుత్ అందించడం ఒక పెద్ద సవాలు. అధిక ధరలకు విద్యుత్‌ను అందిస్తే పెట్టుబడులపై ప్రభావం పడుతుంది. అందుకే సీఎం చంద్రబాబు ఆధునిక టెక్నాలజీతో తక్కువ వ్యయంతో విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించారు. ఈ రోజు ఏర్పాటు చేస్తున్న సైబర్ రెజిలియన్స్ సెంటర్, మన విద్యుత్ వ్యవస్థలకు ఒక రక్షణ కవచంలా పనిచేస్తుంది" అని లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ, "రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంతో భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. ఈ తరుణంలో మన విద్యుత్ గ్రిడ్లు, వ్యవస్థల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఉంది. అందుకే ఈ సైబర్ రెజిలియన్స్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం" అని తెలిపారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జుర్గెన్స్ మాట్లాడుతూ, ఏపీ ప్రభుత్వ ముందుచూపును ప్రశంసించారు. "ఏఐ వంటి సాంకేతిక విప్లవం చోటుచేసుకుంటున్న ఈ సమయంలో ఇంధన వ్యవస్థల భద్రత అనేది అత్యంత కీలకమైన అంశం. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చొరవ తీసుకోవడం అభినందనీయం. భారత్‌లో ఇంధన రంగంలో వేగంగా నిర్ణయాలు జరుగుతున్నాయి. సామాజికంగా, ఆర్థికంగా స్వావలంబన సాధించాలంటే ఇలాంటి భద్రతా కేంద్రాలు ఎంతో అవసరం" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

# బిహార్ ఎన్నికల పాఠాలివే స్టాలిన్ కీలక వ్యాఖ్యలు

సంకీర్ణాలు, స్థిరమైన ప్రచారంపై ఎన్నికల ఫలితాలు ఆధారపడి ఉంటాయన్నారు. ఇండియా కూటమిలో అనుభవజ్ఞులైన రాజకీయ నాయకులు ఉన్నారన్నారు. భవిష్యత్తులో వచ్చే కొత్త రాజకీయ సవాళ్లను పరిష్కరించేందుకు వ్యూహాత్మక ప్రణాళిక వేయగలరన్నారు. ఈసందర్భంగా ఆయన ఎన్నికల కమిషన్‌ను ఉద్దేశిస్తూ పలు ఆరోపణలు చేశారు. ఈ ఫలితంలో ఈసీపై వచ్చిన ఆరోపణలను పూర్తిగా కొట్టిపారేయలేమని వ్యాఖ్యానించారు. ఈసీ ప్రతిష్ట దిగజారిపోయిందన్నారు. ఓడిపోయిన అభ్యర్థుల్లో కూడా విశ్వాసాన్ని ప్రేరేపించేలా ఎన్నికల సంఘం ఉండాలన్నారు. బిహార్‌లో రెండు దశల్లో జరిగిన ఎన్నికలకు శుక్రవారం ఫలితాలు వెలువడ్డాయి. ఇందులో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించింది. 245 సీట్లకు గాను 202 సీట్లను సొంతం చేసుకుంది. ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష ఆర్జేడీ నేతృత్వంలోని మహాగట్ బంధన్ కేవలం 34 సీట్లకే పరిమితమైంది.

# ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించడం నా అదృష్టం

తన కృషి ఫలితంగా కొవ్వూరులో రెండు రైళ్లు, అనపర్తిలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ సౌకర్యం కల్పించగలిగామని తెలిపారు. పొగాకు రైతుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని, మొంథా తుపాను వల్ల కలిగిన నష్టంపై కూడా కేంద్రంతో చర్చించానని ఆమె పేర్కొన్నారు. అనంతరం గోదావరి పుష్కరాల నిర్వహణపై అధికారులతో పురందేశ్వరి సమీక్ష సమావేశం నిర్వహించారు. పుష్కర పనులకు సంబంధించిన అంచనాలను తక్షణమే రూపొందించాలని అధికారులను ఆదేశించారు. శాఖాపరమైన విధానాలపై వారికి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

# వైకాపాను శాశ్వతంగా తరిమేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి: ప్రత్తిపాటి పుల్లారావు

వారికి సాధారణ పౌరుల్ని చంపడం ఓ లెక్కా? అని మండిపడ్డారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కల్తీ నెయ్యి అంశం సీఎం చంద్రబాబు సృష్టించిందేనని కొందరు రాజకీయ అజ్ఞానులు అన్నారని, సిట్ విచారణలో బయటపడుతున్న అంశాలపై వారు ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. వైకాపాను ఏపీ నుంచి శాశ్వతంగా తరిమే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

# ముఠాల మూలాలు తేల్చండి.. విశాఖ గోమాంసం ఘటనపై పవన్ కల్యాణ్ సీరియస్

కేసును పోలీసులకు అప్పగించినట్లు కమిషనర్ పవన్ కల్యాణ్‌కు వివరించారు. కోల్డ్ స్టోరేజ్ నిర్వాహకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని తెలిపారు. ఈ మాంసాన్ని ఎక్కడి నుంచి సేకరించారు, ఎక్కడికి తరలించాలని చూశారు, అనుమతుల్లో ఎలాంటి ఉల్లంఘనలు జరిగాయనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని కమిషనర్ పేర్కొన్నారు. దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అక్రమ గోవధ, గోమాంసం విక్రయాలు, ఎగుమతులను ఏ రూపంలోనూ సహించేది లేదని పవన్ తేల్చిచెప్పారు. ఎన్డీయే ప్రభుత్వం గోవధ నిషేధంపై ఎంత పటిష్టంగా పనిచేస్తుందో ఈ ఘటనే నిదర్శనమని అన్నారు. గతంలో తన దృష్టికి రాగానే పిఠాపురంలోని జంతు వధశాలను మూసివేయించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

# సూపర్ స్టార్ కృష్ణ వర్ధంతి సందర్భంగా జగన్ ట్వీట్

కాగా, తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తొలి జేమ్స్‌బాండ్, తొలి కౌబాయ్, తొలి సినిమాస్కోప్, స్టీరియోఫోనిక్ సౌండ్, 70ఎంఎం వంటి ఎన్నో సాహసోపేత ప్రయోగాలకు శ్రీకారం చుట్టిన ఘనత సూపర్ స్టార్ కృష్ణకే దక్కుతుంది. ఆయన వర్ధంతి సందర్భంగా సినీ, రాజకీయ ప్రముఖులతో పాటు అభిమానులు కూడా ఆయనను స్మరించుకుంటూ నివాళులు అర్పిస్తున్నారు.

# కృత్రిమ మేధ మానవాళికి ముప్పు కాదు: నారా లోకేశ్

"ఐటీ రంగం వల్లే పారిశ్రామిక వేత్తలు అభివృద్ధి సాధిస్తారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లో వ్యాపారవేత్తలు పురోగతి సాధిస్తున్నారు. నెలకు రూ.50 వేలు సంపాదించే వ్యాపారవేత్త రూ.లక్ష సంపాదించేలా ప్రయత్నిస్తున్నాం. నెలకు రూ.5 లక్షలు సంపాదిస్తుంటే.. దాన్ని రూ.25 లక్షలకు అభివృద్ధి చేసేలా పనిచేస్తున్నాం. ఇలా చేసినప్పుడే 2.4 ట్రిలియన్ డాలర్ ఎకానమీకి చేరుకుంటాం. ఇక్కడ ఉన్న వ్యాపారవేత్తలతో పనిచేసేందుకు ప్రభుత్వం ఉత్సాహంగా ఉంది. నిర్మాణాత్మక సంస్కరణలు తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం" అని నారా లోకేశ్ అన్నారు.

# మా హక్కులు మా వారోత్సవాలు



(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, నవంబర్ 15)
బాలల హక్కుల వారోత్సవాలు, స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలను పురస్కరించుకుని శనివారం కనిగిరి పాతూరు అంగన్వాడీ సెంటర్, దొరువుబజార్ అంగన్వాడీ సెంటర్స్ నందు సీడీపీఓ సరోజిని పాల్గొని హ్యాండ్ వాష్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతిజ్ఞ చేయించి, తల్లులకు పరిశు భ్రత గురించి వివరిస్తూ చిన్న వయసు నుండే చేతులు శు భ్రపరుచుకోవడం లాంటి మంచి అలవాట్లను పిల్లలకు నేర్పించాలని, అలా నేర్పించడం వలన పిల్లలు అనారోగ్యలకు గురయ్యే ప్రమాదం కొంత వరకు తగ్గించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమం లో సెక్టార్ సూపర్ వైసర్ సుమతి, అంగన్వాడీ వర్కర్స్ బీబీజాన్, రజని, వెంకటరత్నం, మల్లేశ్వరి, ఆయాలు, తల్లులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం ప్రాజెక్ట్ కార్యాలయం నందు మొక్కలు నాటారు.



# హాస్టల్‌ను తనిఖీ చేసిన జూనియర్ సివిల్ జడ్జి బాలాజీ

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, నవంబర్ 15)
మార్కాపురం పట్టణంలోని తర్లపాడు రోడ్డులో గల సాంఘిక సంక్షేమ శాఖ బాలికల హాస్టల్ ను శనివారం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బాలాజీ తనిఖీలు చేశారు. తనిఖీలో భాగంగా హాస్టల్ పరిసరాలను, విద్యార్థినిల గదులను, వంటశాల స్టోర్ రూమ్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. పరిసరాలు శుభ్రంగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. మళ్లీ తనిఖీకి వచ్చే లోపు ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని హెచ్చరించారు. సమయానికి భోజనం, వసతులు, ఏవైనా




సమస్యలు ఉన్నాయా అని విద్యార్థినీలను అడిగి తెలుసుకున్నారు. మెను ప్రకారం విద్యార్థినులకు సరైన భోజనం కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. అనంతరం మండల లీగల్ అథారిటీ సర్వీస్ చైర్మన్ ఆధ్వర్యంలో మండల న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. చిల్డ్రన్స్ డే సందర్భంగా విద్యార్థినులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు అన్వర్ బేగ్, ఉషశ్రీ, పారా లీగల్ వాలంటీర్స్ భాష, ఆదినారాయణ, పవన్ కుమార్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

## నేడు రాష్ట్ర గవర్నర్ బాపట్లకు రాక

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్




(షణ్ముఖ వెలుగు, బాపట్ల, నవంబర్ 15)

ఒక రోజు పర్యటన నిమిత్తం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదివారం బాపట్లకు రావడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక జిల్లా కలెక్టరేట్ లోని న్యూ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు ఆదివారం జిల్లాలో రాష్ట్ర గవర్నర్ పర్యటనకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లు పై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్ ఆదివారం ఉదయం 10 గంటలకు రాజ్ భవన్ నుండి బయలుదేరి ఉదయం 11.45 గంటలకు గోల్డెన్ సాండ్ సూర్యలంక బీచ్ చేరుకొని విశ్రాంతితీసుకుంటారు.అనంతరం రాత్రి 7.55 గంటలకు బ్రామర అజంతా సూర్యలంక బీచ్ నుండి బయలుదేరి రాత్రి 10 రాజ్ భవన్ చేరుకుంటారని తెలిపారు. రాష్ట్ర గవర్నర్ పర్యటనకు సంబంధించి జాయింట్ కలెక్టర్ భావన ఇంచార్జిగా ఉంటారని, గవర్నర్ ఏడీఎస్‌లకు అవసరమైన రూమ్స్ ఏర్పాటు చేయాలని ఆర్‌డిఓ, తహశీల్దార్ సూచించారు. సెక్యూరిటి, బందోబస్తు ఏర్పాట్లు పోలీసుశాఖ (తరువాయి 4లో...)

## 50 ఏళ్ల తర్వాత తర్లుపాడులో కనుల విందుగా తెప్పోత్సవ కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, నవంబర్ 15)

మండల కేంద్రమైన తర్లుపాడులో వెంచేసియున్న శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ నిర్వాహకులు గ్రామ ప్రజల, ఉభయదాతల ఆధ్వర్యంలో కనువిందుగా, అంగరంగ వైభవంగా తెప్పోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అనువంశిక ధర్మకర్త జవ్వాజి విజయభాస్కరరావు పాత్రికేయులతో మాట్లాడతూ తర్లుపాడు చెరువుఅర్ధ శతాబ్దికాలంలో కేవలం మూడు నాలుగు సార్లు మాత్రమే అలుగు నిండడం జరిగిందన్నారు. అప్పటినుండి నేటివరకు ఒకసారి మాత్రమే ఆలయం తరఫున తెప్పోత్సవం జరిగిందన్నారు. కానీ ఈ ఏడాది కాలంలో వర్షాలు పడటమే కాక కార్తీక మాసంలాంటిశుభఘడియలలో జలహారతులు చేయడానికి పరిస్థితులు అనుకూలించడంతో గ్రామంలోని ప్రజలందరికీ అన్ని శుభాలే కలుగుతాయి అన్న ఉద్దేశంతో గ్రామ పెద్దలందరినీ ఆలయంలోనికి ఆహ్వానించి సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. దీంతో ఆలయ ఉభయ దాతలు, గ్రామ ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని దిగ్విజయం చేసేందుకు అందరూ సంయుక్తంగా తీర్మానం చేసుకోవడం జరిగిందన్నారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, సంబంధిత జిల్లా అధికారులందరిని సంప్రదించడం కూడా జరిగిందన్నారు. వారందరి ఆమోదం మేరకు శనివారం మధ్యాహ్నం 2.30 నిమిషాల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు చెరువులో అంగరంగ వైభవంగా అమ్మవార్లు, ఉభయ దాతలు జలవిహారం వైభవంగా జరిగిందన్నారు.

జలవిహారంలో ఎలాంటి ఉపద్రవాలు జరగకుండా ఉండేందుకు ఆలయ ధర్మకర్త విజయవాడ నుండి పది మంది గజ ఈత గాళ్లను, స్థానిక గ్రామానికి చెందిన 30 మంది బెస్తవారి సంఘం వారి సహాయ సహకారాలతో కార్యక్రమం సజావుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి సంఘటనలు, ప్రమాదాలు జరకుండా ఉండేందుకు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఉత్తర్వుల మేరకు దర్శి డిఎస్పి బి లక్ష్మీనారాయణ, పొదిలి సీఐ రాజేష్ కుమార్, కొనకనమిట్ల, తర్లుపాడు ఎస్‌ఐలు శ్రీకాంత్, బ్రహ్మనాయుడు, ముండ్లమూరు ఏ ఎస్ఐ వెంకటేశ్వరరెడ్డి, 40 మంది పోలీసు సిబ్బందితో పకడ్బందీగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు. సకాలంలో గ్రామ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జల విహార అమ్మవార్ల తెప్పోత్సవ కార్యక్రమం విజయవంతం చేశారు. అనంతరం పుర వీధులలో భక్తులు దేవతలను స్మరించుకుంటూ ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పోలీసు అధికారులను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ధర్మకర్త జవ్వాజి విజయభాస్కరరావులు పోలీస్ అధికారులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, వైఎస్ఆర్ పార్టీ ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మి, జనసేన పార్టీ నాయకులు, గ్రామ మహిళలు, పురుషులు తండోపతండాలుగా చెరువు కట్టపై బారులు దేరి తెప్పోత్సవ జలవిహార కార్యక్రమాన్ని కనుల విందుగా తిలకించారు. కట్ట సమీపాన ఉన్న సచివాలయం వద్ద భక్తులకు అల్పాహార విందును ఏర్పాటు చేశారు. (తరువాయి 4లో...)

## స్వామి వారి ఆభరణాల దొంగతనం కేసులో ముద్దాయిలు అరెస్టు

### 8 కిలోల వెండి స్వాధీనం

### మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన డిఎస్పీ నాగరాజు







(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, నవంబర్ 15)

గిద్దలూరు పట్టణంలోని రాచర్ల రోడ్డులో గల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి గుడిలో స్వామి వారి ఆభరణాలు దొంగలించిన కేసులో ముద్దాయిలు వడ్లమాను శివారెడ్డి, జెట్టిబోయన ప్రవీణ్‌లను శనివారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లు మార్కాపురం డిఎస్పీ యు నాగరాజు తెలిపారు. శనివారం స్థానిక సర్కిల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. గత నెల 23వ తేదీ పట్టణంలోని రాచర్ల రోడ్డులో గల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో రాత్రి సమయంలో గుడికి వేసిన తాళాలు ఇనుప రాడ్డుతో పగులగొట్టి గుడిలో ఉన్న సిసి కెమెరా వైర్లు కట్ చేసి గుడిలో దేవుడికి అలంకరించి ఉన్న సుమారు 10 కిలోల బరువు గల వెండి ఆభరణాలు దొంగలించారు. ఆలయ పూజారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. కేసు విషయంలో జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు సూచనలతో ఐదు ప్రత్యేక టీములను ఏర్పాటు చేసి గిద్దలూరు సిఐ కె సురేష్, గత సిసిఎస్ సిఐ జగదీష్, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుధాకర్, గిద్దలూరు రూరల్ సిఐ రామకోటయ్య సిబ్బందితో అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టడం జరిగిందన్నారు. కేసులో ముద్దాయిలు అయిన వడ్లమాను శివారెడ్డి పై తాడేపల్లి, ఓల్డ్ గుంటూరు, ప్రత్తిపాడు, చీరాల, బాపట్ల, రేపల్లె, మేదరమెట్ల, అద్దంకి, ఇబ్రహీంపట్నం, వట్టి చెరుకూరు, నల్లపాడు, బద్వేలు, కందుకూరు, సింగరాయకొండ, బంగోలు. పిడుగురాళ్ల టౌను, జరుగుమల్లి, చీమకుర్తి, సింగరాయకొండ, త్రిపురాంతకం, మార్కాపురం, రాచర్ల మొదలగు ఏరియాల్లో గూడులు దొంగతనాలు, వైన్ షాపులు, సూపర్ మార్కెట్లు, బైకులు దొంగతనాలు చేస్తూ మరియు గంజాయి అమ్ముకుంటూ జీవనం సాగిస్తూ ఉంటాడని తెలిపారు. అతని పై సుమారు 40-50 కేసులు ఉన్నాయన్నారు. వడ్లమాను శివారెడ్డి నుండి 5 కిలోల స్వామి వారి వెండి ఆభరణాలు, 1500 గ్రాముల బరువు గల గంజాయి, వివో కంపెనీకి చెందిన సెల్ ఫోన్, పామూరు పోలీస్ స్టేషన్‌లో బిఎన్ఎస్ కేసులో దొంగలించబడిన ఏపి 39క్యూ9502

## అటవీశాఖ అధికారి పై వేటు

### గుప్తనిధుల తవ్వకాల దుండగులకు సహకరించాడని అధికారి పై చర్యలు

### మార్కాపురం ఫారెస్టు డిప్యూటీ డైరక్టర్ అబ్దుల్ రవూఫ్



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, నవంబర్ 15)

అటవీ సంపదను కాపాడాల్సిన అధికారులే ఆక్రమాలకు అండగా నిలుస్తున్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో ఎంతో విలువైన సంపద ఉంటుంది. దానిని దోచుకునేందుకు ఎంతో మంది ప్రయత్నాలు చేస్తుంటారు. అలాంటి వారి నుంచి అటవీ సంపదను కాపాడాల్సిన అధికారులు లంచాలకు లొంగి వారి చేతిలో అటవీ సంపద పెడుతున్నారు. ఇటువంటి ఒక అధికారిని గుర్తించిన ఫారెస్టు ఉన్నతాధికారులు అతని పై సస్పెండ్ వేటు వేశారు. ఎర్రగొండపాలెం మండలంలోని గంజివారిపల్లి ఫారెస్టు రేంజ్ పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఆలయాలు, భూములు, పులులుతో పాటు ఇతర విలువైన సంపద ఉంది. వాటిని దోచుకునేందుకు ఈ ఏడాది ఆగస్టు నెలలో కొందరు పక్కా ప్లాన్ ఎక్స్కవేటర్, జీవు, కారులతో 10 మంది వరకు ఫారెస్టులోని చెక్ పోస్టులను దాటుకుని మూడు రోజుల పాటు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు. చెక్ పోస్టులను దాటుకొని తవ్వకాలు జరిపారంటే ఆ శాఖ వారి అధికారి, సిబ్బంది పాత్ర కూడా ఉండే ఉంటుందని అనుమానం వచ్చింది. ఆ సంఘటన జరిగిన కొద్ది రోజులకే మార్కాపురం డీఎఫ్వో బదిలిపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న మార్కాపురం ఫారెస్టు డిప్యూటీ డైరక్టర్ అబ్దుల్ రవూఫ్ సీరియస్ గా తీసుకుని స్వయంగా ఆయనే కేసును విచారణ చేపట్టారు. ఈ విచారణలో గంజివారిపల్లి సెక్షన్ అధికారి పఠాన్ కరిముల్లా ఖాన్ పాత్ర ఉన్నట్లు తెలడంతో కరిముల్లా ఖాన్‌ను డీడీ సస్పెండ్ చేశారు. అక్కడ పట్టుబడిన వాహనాలు, వ్యక్తులు దీనిపై ఇంకా విచారణ చేపడుతున్నట్లు సమాచారం. పూర్తి విచారణ అనంతరం మరికొంత మందిపై వేటు వేసి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు

### విపత్తు నిర్వహణలో సమయస్ఫూర్తి, విభాగాల సమగ్ర సమన్వయమే పోలీసుల ప్రధాన శక్తి

### జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు

### మొంథా తుఫాన్ సమయంలో పోలీస్ శాఖ సేవలు ప్రశంసనీయమైనవి

## సమగ్ర ప్రణాళిక, సమన్వయం, సమర్థ పర్యవేక్షణతో ఎలాంటి విపత్తునైనా ఎదుర్కోవచ్చు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 15)

మొంథా తుఫాను సమయంలో జిల్లా యంత్రాంగం స్పందించిన తీరే దీనికి నిదర్శనమని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు చెప్పారు. తుఫాను సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందీ కలగకుండా చురుకుగా వ్యవహరించిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాల ప్రాధానోత్సవం శనివారం ఒంగోలు రిమ్స్ ఆసుపత్రి ఆడిటోరియంలో జరిగింది. జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ ఈ కార్యక్రమంలో పాల్గొని విపత్తుల సమయంలో ఎదురైన పరిస్థితులను, అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ తుఫాను సమయంలో ప్రభుత్వ ఉద్యోగులందరూ పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు పనిచేయటం వలన జిల్లాలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని చెప్పారు. ‘ ప్రజల నుంచి ప్రశంసలు పొందడంతో పాటు మీ బిడ్డలకు కూడా స్ఫూర్తిగా నిలిచారు. ఇదే స్ఫూర్తిని ఇకముందు కూడా విధుల నిర్వహణలో చూపి ఇతరులకు మార్గదర్శకంగా నిలవాలి ‘ అని పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు, రెవెన్యూ విభాగాల మధ్య మంచి సమన్వయం ఉండటం వలన క్షేత్రస్థాయి ఉద్యోగులు సకాలంలో స్పందించి పరిస్థితిని త్వరగా చక్కదిద్దినట్లు, ఎటువంటి ప్రాణ నష్టం సంభవించకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ముఖ్యంగా కొండేపి పియస్ పరిధిలో పొగాకు నారుమడుల దగ్గర వరదలో చిక్కుకున్న 121 మంది కూలీలను ఎస్ఐ చురుకుగా వ్యవహరించి పొగాకు కూలీలను ఎస్.డీ.ఆర్.ఎఫ్. బృందం సహాయంతో సురక్షితంగా తరలించడాన్ని ఎస్ఐని ప్రత్యేకంగా ప్రసంశించారు. విపత్తుల సమయంలో అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయటం సంతోషకరమన్నారు. తుఫాన్ సమయంలో వాగులు, వంకలు, చెరువులు ఉప్పొంగిన నేపథ్యంలో ప్రజల ప్రాణాలను రక్షించేందుకు పోలీస్ సిబ్బంది రాత్రింబవళ్లు పహారా నిర్వహించినట్టు ఎస్పీ గారు పేర్కొన్నారు. గుండ్లకమ్మ గేట్లు ఎత్తివేయడంతో నీరు గ్రామాలు, రహదారుల పైకి చేరిన సందర్భాల్లో ప్రజలను సురక్షిత (తరువాయి 4లో...)







# సమగ్ర ప్రణాళిక, సమన్వయం, సమర్థ

## పర్యవేక్షణతో ఎలాంటి విపత్తునైనా ఎదుర్కోవచ్చు











ప్రాంతాలకు తరలించడమే కాకుండా, నేషనల్ హైవేపై ట్రాఫిక్ అంతరాయం లేకుండా వాహనాల రాకపోకలు కొనసాగేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. తుఫాన్ సమయంలో విద్యుత్ శాఖ అధికారులు కూడా సమర్థవంతంగా విధులు నిర్వహించినందుకు ఎస్పీ అభినందనలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ విపత్తులు, ఎన్నికల నిర్వహణ సమయంలో స్పందించిన తీరే ప్రభుత్వ యంత్రాంగ సామర్థ్యానికి నిదర్శనంగా ఉంటుందన్నారు. తాజా తుఫాను సమయంలో జిల్లా యంత్రాంగ శక్తి సామర్థ్యాలు నిరూపితమయ్యాయి అన్నారు. దీనిని ఒక అనుభవంగా తీసుకుని ప్రజలకు ఉత్తమ సేవలు అందించేలా మరింత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డిఆర్ఓ బి చిన ఓబులేసు మాట్లాడుతూ కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్ పరిస్థితిని నిశితంగా నిరంతరం గమనిస్తూ ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేయటం వలన ప్రజలకు సేవలు, బాధితులకు పరిహారం అందించడంలో ఎవరి నుంచీ ఎలాంటి విమర్శలు రాలేదన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ, ఆర్డీవోలతో పాటు జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయిలో విశిష్ట సేవలు అందించిన అధికారులకు, సిబ్బందిని కలెక్టర్, ఎస్పీ లు ప్రశంసా పత్రాలు అందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. పలువురు జిల్లాస్థాయి అధికారులు, తహసిల్దార్లు కూడా తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

## పైరెడ్డిపాలెం గ్రామంలో జనసేన పార్టీ సభ్యత్వం కార్డులు పంపిణీ



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, నవంబర్ 15) మండలంలో పైరెడ్డిపాలెం గ్రామంలో జనసేన పార్టీ నాయకులు పర్యటించి జనసేన పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి సభ్యత్వపు కార్డులు ఈరోజు పంపిణీ చేయడం జరిగింది. అతి తొందరలో పొన్నలూరు పైరెడ్డిపాలెం భోగనంపాడు



చెరుకూరు అగ్రహారం గ్రామాలలో ఒకేరోజు జనసేన పార్టీ జెండా ఆవిష్కరణలు జరుగుతాయి. ఈ కార్యక్రమాలకు రాష్ట్రస్థాయి జిల్లాస్థాయి నియోజకవర్గస్థాయి, మండల స్థాయి జనసేన పార్టీ నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. వైసీపీ పార్టీ నుండి జనసేన పార్టీలో భారీ స్థాయిలో చేరికలు కూడా ఉంటాయి అని జనసేన పార్టీ కొండపి నియోజకవర్గం సమన్వయకర్త కనపర్తి మనోజ్ కుమార్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పొన్నలూరు మండలం ఉపాధ్యక్షులు కర్ణ తిరుమలరెడ్డి, పత్తిపాటి మాధవరావు, నల్లగంగు వెంకటేశ్వరరెడ్డి, మహేంద్ర, వెంకటరెడ్డి, మిడసల అనిల్, నల్లగంగు శ్రీనివాసరెడ్డి, సగిరి రాఘవరెడ్డి పాల్గొన్నారు.

## దేవరాజుగట్టులో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం




(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, నవంబర్ 15) మండలంలోని దేవరాజుగట్టు గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి జాన్ సుందరం, మండల డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, మండల కన్వీనర్ మెట్టు శ్రీనివాసరెడ్డి, మాజీ మండల కన్వీనర్ గొట్టం శ్రీనివాసరెడ్డి మాజీ జడ్పిటిసి గుమ్మ గంగరాజు యాదవ్, దోర్నాలం టిడిపి మండల కన్వీనర్ మాబు, టిడిపి నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, అధికారులు, కూటమి నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గడ్డం ఆదినారాయణ






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 15) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఒంగోలు నియోజకవర్గ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆదేశాల మేరకు శనివారం 15వ డివిజన్ రాంనగర్ 2వ లైన్ లో గవర్నమెంట్ స్కూల్ నందు "వ్యక్తిగత పరిశుభ్రత" అనే అంశం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 15వ డివిజన్ అధ్యక్షులు గడ్డం ఆదినారాయణ, స్కూల్ హెడ్ మాస్టర్ వెంకటేశ్వర్లు, సచివాలయం శానిటేషన్ ఇన్స్పెక్టర్ సుబ్బయ్య, సచివాలయం శానిటేషన్ బెజవాడ అనూష, సూపర్‌వైజర్ మురళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్థానిక సచివాలయ సిబ్బందితో కలిసి స్కూల్ పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రత మీద అవగాహన కల్పించారు. అనంతరం పరిశుభ్రత స్వచ్ఛత పై స్కూల్ పిల్లల చేత ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.

## స్వామి వారి ఆభరణాల దొంగతనం కేసులో ముద్దాయిలు అరెస్టు



గల మోటారు బైకు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. రెండో ముద్దాయి జెట్టిబోయిన ప్రవీణ్ నుంచి 3 కిలోల కరిగించిన వెండి ముద్దలు మూడు, వివో కంపెనీ టబ్ సెల్ ఫోన్ ఒకటి, ఐక్యూ కంపెనీకి చెందిన ఒక టచ్ సెల్ ఫోన్ ఒకటి, శివారెడ్డి ఇచ్చిన వెండి కరిగించే మిల్టింగ్ మిషన్ ఒకటి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. కేసు త్వరిత గతిన ఛేదించిన మార్కాపురం డిఎస్పీ నాగరాజు, గిద్దలూరు అర్బన్ సిఐ కె సురేష్, ప్రస్తుత్తం ఒంగోలు సిసిఎస్ సిఐ సుధాకర్, ట్రాఫిక్ సిఐ జగదీష్, గిద్దలూరు రూరల్ సిఐ రామకోటయ్య, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ప్రత్యేకంగా అభినందించారు.

## 50 ఏళ్ల తర్వాత తర్లుపాడులో కనుల విందుగా తెప్పోత్సవ కార్యక్రమం









## నేడు రాష్ట్ర గవర్నర్ బాపట్లకు రాక



చూడాలని డిఎస్పీని ఆదేశించారు. గవర్నర్ పర్యటనకు కాన్వాయి అవసరమైన వాహనాలు ఏర్పాటు చేయాలని డిటిసిని ఆదేశించారు. అంబులెన్స్, డాక్టర్లును అందుబాటులో ఉండేలా చూడాలని డియంహెచ్‌ఓ, డిసిహెచ్ఎస్‌ను ఆదేశించారు. మున్సిపాలిటీ, సూర్యలంక బీచ్ పరిధిలో శానిటేషన్ చేయాలని మున్సిపల్ కమిషనర్, డిపిఓను ఆదేశించారు. విద్యుత్ సరఫరా నిరంతరం ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. గవర్నర్‌కి ఇంగ్లీష్, హిందీ న్యూస్ పేపర్స్ ను అందజేయాలని సమాచార శాఖ ఏడిని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ భావన, డిఆర్ఓ జి గంగాధర్ గౌడ్, డిపిఓ ప్రభాకర్ రావు, డియంహెచ్‌ఓ డాక్టర్ విజయమ్మ, మున్సిపల్ కమిషనర్ రాఘునాథ్‌రెడ్డి, డిటిసి, జిల్లా అగ్నిమాపక శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కేశవరపు జాలిరెడ్డికి ఘన సత్కారం





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, నవంబర్ 15) వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన కేశవరపు జాలిరెడ్డిని ఉలవపాడు మండల కో ఆప్షన్ సభ్యులు, మైనారిటీ నాయకులు, స్థానిక యూత్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయ సమస్యల పై నిరంతరం పోరాడే వ్యక్తి కి పదవీ రావడం వలన ఉపాధ్యాయులకు మేలు జరుగుతుందన్నారు. ఆయనకు శాలువ కప్పి సత్కరించారు. రాష్ట్ర అధ్యక్ష పదవి ఉలవపాడు మండలం వ్యక్తికి రావడం ఈ మండలానికి గర్వ కారణం అని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పరిశుభ్రమైన జిల్లాగా బాపట్ల జిల్లాను తీర్చిదిద్దేందుకు అందరు కృషి చేయాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్

(షణ్ముఖ వెలుగు, బాపట్ల, నవంబర్ 15)

పరిశుభ్రమైన జిల్లాగా బాపట్ల జిల్లాను తీర్చిదిద్దేందుకు అందరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. శనివారం, స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంను నగరం మండలంలోని శ్రీ వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల నందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరైనారు. జిల్లా కలెక్టర్ కళాశాలలో ఎన్.సి.సి. విద్యార్థులచే గౌరవ వందనం స్వీకరించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ర్యాలీని జిల్లా కలెక్టర్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ కళాశాల నుండి నగరం ప్రధాన రహదారి కూడలి నుండి కళాశాల వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వివేకానంద మాట్లాడుతూ, స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారని కలెక్టర్ తెలిపారు. ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ప్రతినెల ఒక్కొక్క అంశాన్ని ప్రాతిపదికగా చేపడుతుండగా ఈ నెల వ్యక్తిగత , సమాజ పరిశుభ్రత అనే అంశంగా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రపంచాన్ని మార్చే ముందు మిమ్మల్ని మీరు ముందు మార్చుకోండి, మీలో మార్పు వస్తే దేశంలో మార్పు రావచ్చని మహాత్మా గాంధీ తెలిపిన అంశ దృక్పథంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ అంశాన్ని తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. వ్యక్తిగత మరియు సమాజ పరిశుభ్రత అనే అంశం చాలా మంచి అంశమని, ప్రతిరోజు అందరూ శుభ్రంగా స్నానం చేయాలని, వారితోపాటు వారి ఇంటిని వారి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాలు శుభ్రంగా ఉంటే మన ఆరోగ్యం బాగుంటుందని ఆయన తెలిపారు. బాపట్ల జిల్లాలో నీళ్లకు కొదవలేదని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎంతో వైవిధ్యమైన రాష్ట్రమని, ఎక్కడ చూసినా నీళ్ళు పుష్కలంగా ఉంటాయని ఆయన తెలిపారు. ప్రతి ఇంట్లో మరుగుదొడ్డిని ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఎవరు కూడా ఆరుబయట మల విసర్జన చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ప్రతి వ్యక్తి ఇల్లు నిర్మించుకునేటప్పుడు ముందుగా మరుగుదొడ్డి నిర్మించుకోవాలని, ఆ తర్వాత మిగిలిన వసతులు ఏర్పాటు చేసుకోవాలని ఆయన అన్నారు. ప్రతి గ్రామంలో 100% మరుగుదొడ్ల నిర్మాణం చేయాలని ఆయన అన్నారు.మన ఇంటిని మనం ఏ విధంగా పరిశుభ్రంగా ఉంచుకుంటున్నామో, అదేవిధంగా మన పరిశ్రమలను కూడా శుభ్రంగా ఉంచుకుంటూ, మొక్కలు నాటాలని ఆయన అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు, పల్లె పెద్దలు పల్లె ప్రజలకు తెలియజేయాలని, మనం పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యం బాగుంటుందని, ఆరోగ్యం బాగుంటే ఎక్కువ సమయం పని చేస్తామని, ఎక్కువ సమయం పని చేస్తే రాష్ట్రం బాగుంటుందని, ఈ దిసెగ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి పనిచేస్తూ, పని చేయిస్తున్నారని ఆయన అన్నారు. ప్రతి గ్రామంలో కాలులు ఉండాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ క్రింద సోప్ పిట్లు, పశువులకు కంపోస్ట్ ఫీట్లు ఏర్పాటుచేసి సమాజ వ్యక్తిగత పరిశుభ్రతను కాపాడుతుందని జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఎవరు ఎలా ఉన్నారో అని తెలుసుకోవాలంటే అతనిని చూసి తెలుసుకోవచ్చని, కార్యాలయమును చూసి ఆ అధికారి యొక్క మనస్తత్వంను తెలుసుకోవచ్చని ఆయన అన్నారు. అభివృద్ధి చెందుతున్న ప్రపంచ దేశాల్లో ప్రజలు వ్యక్తిగత, సమాజ పరిసరాల పరిశుభ్రతకు ఎంతో ప్రాధాన్యత ఇస్తారని, వారి ఇంట్లో ఉండే చెత్తను నిర్దిష్టమైన ప్రదేశాలలో ఉంచుతారని, చెత్తను ఎక్కడపడితే అక్కడ పడవేయరని ఆదిశగా మనలోను చైతన్యం రావాలని ఆయన అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, యుక్త వయసులో బాలికలలో వచ్చే మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ బాలికలకు జిల్లా వైద్యాధికారి వారిచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో అమ్మాయిలు, అబ్బాయిలు ఒకటేనని ఆయన అన్నారు. అమ్మాయిలు బాగా చదువుకొని పై స్థాయిలకు ఎదగాలని ఆయన అన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వృత్తి నుండి సివిల్స్ కు వచ్చానని, డాక్టర్ గా పనిచేసేటప్పుడు 97 ప్రసూతి కేసులకు హాజరైనారని ఆయన తెలిపారు. మహిళలకు ప్రతి నెల వచ్చే ఋతుక్రమంలో రక్తం ఎక్కువగా కోల్పోతారని, మహిళలు మంచి ఆహారం తీసుకోవాలని, మీకు వచ్చే సమస్యలను గోప్యంగా ఉంచకుండా, తల్లికి,స్నేహితులకు చెప్పుకొని వాటిని అధిగమించాలని ఆయన తెలిపారు. మంచి ఆహారం తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, విద్యార్థినులు అందరూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన అన్నారు. ప్రతిరోజు మన ఏ పని చేసినా ఆరోగ్యం గురించి ఆలోచిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. ఆరోగ్యం గురించి ఆలోచించినప్పుడు మంచి ఆహారం తీసుకుంటూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చిన్నపాటి వ్యాధులకు గురికాకుండా అందరం ఆహారం తీసుకోబోయే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని ఆయన అన్నారు. చేతులను ఎప్పుడు ఏ విధంగా ఎలా శుభ్రపరచుకోవాలి అనే విషయమై కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చేతుల శుభ్రత – ఆరోగ్యానికి భద్రత అనే కరపత్రాలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి విచ్చేసిన అధికారులు, విద్యార్థులచే ఆయన ప్రతిజ్ఞ చేయించారు. బాపట్ల జిల్లా టూరిజంకు ప్రసిద్ధి చెందిందని, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. బాపట్ల జిల్లాలో సూర్యలంక బీచ్, రామాపురం బీచ్ లకు ఎక్కువగా పర్యాటకులు వస్తుంటారని, అక్కడ రిసార్టు బాగా అభివృద్ధి చెందాయని, పరిసరాలను ఎల్లవేళలా పరిశ్రమంగా ఉంచి, పర్యాటకులను ఆకర్షించాలని ఆయన అన్నారు. పర్యాటకులు ఎక్కువగా జిల్లాకు విచ్చేసినప్పుడు ఆదాయం పెరుగుతుందని తద్వారా జీడీపీ రేటు పెరుగుతుందని ఆయన అన్నారు. అనంతరం నగరం మండలంలోని గౌడు పాలెం లో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద నిర్మించిన గోకులం షెడ్డును జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ గోకులం షెడ్డు లబ్ధిదారులతో ప్రారంభోత్సవం చేయించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు ఉప్పాళ్ళ చెన్నకేశవులతో వారి యొక్క స్థితిగతులను, వారికి గల పశువుల వివరాలను, గోమూత్ర నిల్వ చేసే ట్యాంకులను ఆయన పరిశీలించారు. నగరం మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద చేపట్టిన పనుల వివరాల పై ఎంపీడీవో ను ఆయన ఆరా తీశారు. అనంతరం గాలివారిపాలెం లో వరి పొలంలో ఏర్పాటుచేసిన మామిడి చెట్ల ఉద్యానవన పంటను ఆయన పరిశీలించారు వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, రేపల్లె రెవెన్యూ డివిజన్ అధికారి రామలక్ష్మి, జిల్లా అధికారులు, కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

















# గిరిజన పిల్లలందరు చదువుకోవాలి

## గిరిజన సంక్షేమ వసతి గృహాల లో పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### జాయింట్ కలెక్టర్ భావన

(షణ్ముఖ వెలుగు, వేటపాలెం, నవంబర్ 15)



గిరిజన సమస్యల పై బ్రిటిష్ పాలకులతో పోరాటాలు చేసిన నాయకుడు బిర్సా ముండను ఆదర్శంగా తీసుకొని గిరిజనులు అభివృద్ధి చెందాలని జిల్లా జాయింట్ కలెక్టర్ భావన తెలిపారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వము వారి ఆదేశాల మేరకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉదయం వేటపాలెం మండలం,గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల నందు గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు "శ్రీ భగవాన్ బిర్సాముండా 150వ జయంతి, (జాన్ జాతీయ గౌరవ దివాస్ ) వేడుకల సందర్భంగా గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండ చిత్ర పటానికి పూలమాలలు వేసి జాయింట్ కలెక్టర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన సమస్యల పై బ్రిటిష్ పాలకుల తో పోరాటాలు చేసిన నాయకుడు బిర్సా ముండని ఆదర్శంగా తీసుకొని గిరిజనలు అభివృద్ధి చెందాలన్నారు.గిరిజనుల కష్టాలను తెలుసు కోవడానికి ప్రచారం మాధ్యమాలు లేని రోజుల్లో కొండ ప్రాంతాలకు వెళ్లి గిరిజన ప్రజలను చైతన్యం చేసి బ్రిటిష్ ప్రభుత్వంపై పోరాటా లు చేయడం జరిగిందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు గిరిజన ప్రాంతాల్లో నేను సబ్ కలెక్టర్ గా పనిచేయడం జరిగిందని అప్పుడు గిరిజన ప్రాంతాల్లో పర్యటించి గిరిజన సమస్యలను తెలుసుకోవడం జరిగిందన్నారు. గిరిజనులు ముక్యంగా రెండు అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఒకటి చదువు, రెండు ఆరోగ్యమని తెలిపారు. గిరిజన పిల్లల చదువుల కోసం ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తుందని గిరిజనలు తమ పిల్లలను బడికి పంపించి బాగా చదివించుకోవలన్నారు. చదువుకుంటే ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. గిరిజన ప్రాంతాలు పరిశుభ్రంతో పాటుగా వ్యక్తిగత శుభ్రతను పాటించాలని అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనల సంక్షేమం కోసం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అములు చేస్తుందని వాటి ఉపయోగించుకొని గిరిజనుల ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా బాలికలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించించారు. అంతకు ముందుగా జాయింట్ కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి బీర్సా ముండా, చిత్రపటనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడ గిరిజన సంఘాల నాయకులు కొన్ని సమస్యలు నా దృష్టికి తీసుకురావడం జరిగిందని వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో గిరిజన ప్రాంతాలలో పర్యటించి గిరిజన సమస్యలను తెలుసుకొని వాటిని కూడా పరిష్కరం చేయుటకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారి బి.ప్రకాష్ రావు, మండల తహశీల్దార్, యంపీ డి ఓ,యం ఈ ఓ, ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి, గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వీరయ్య, గిరిజన సంఘాల నాయకులు దేవరకొండ రాము, కొమరగిరి ప్రసాద్ రావు,భగవాన్, ఆశ్రమ, గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# శ్రీగోపాలకృష్ణ యాదవ అన్నదాన సత్రం నూతన కమిటీ ఎన్నిక

(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, నవంబర్ 15)





రాచర్ల మండలంలోని శ్రీ నెమిలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థాన ఆవరణలో ఉన్న శ్రీగోపాలకృష్ణ యాదవ అన్నదాన సత్రం అధ్యక్షులు వేల్పుల పెద్ద రాజయ్య అధ్యక్షతన శనివారం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా యాదవ్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓ.వెంకటయ్య యాదవ్, ప్రకాశం జిల్లా అఖిల భారత యాదవ సంఘం అధ్యక్షులు యం గురు ప్రసాద్ యాదవ్, రాష్ట్ర యాదవ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు డాక్టర్ యం పిచ్చయ్య యాదవ్‌లు హాజరయ్యారు. ఈ సమావేశంలో గత రెండు సంవత్సరాలుగా పాత కమిటీ చేసిన అభివృద్ధి పనులను, ఆర్థిక విషయాలను తెలియజేశారు. అనంతరం యం.గురు ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో నూతన కమిటీ అధ్యక్షులుగా బొల్లవరం నారాయణ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా పాశం వెంకట నర్సయ్య యాదవ్, ట్రెజరర్ గా వలసాని శ్రీనివాసులు యాదవ్ యాదవ్ మరియు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులతో ఓ వెంకటయ్య యాదవ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో పాముల సుబ్బరాయుడు యాదవ్, మహేంద్ర యాదవ్, నరసింహా యాదవ్, కృష్ణమూర్తి యాదవ్, రాజ గోపాల్ యాదవ్, వెంకటస్వామి యాదవ్, రోషయ్య యాదవ్, రవికాంత్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## సంగమేశ్వరస్వామి ఆలయంలో అభిషేకం



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, నవంబర్ 15)
పొన్నలూరు మండల ఏపీవో సుధాకర్ చెన్నిపాడు గ్రామంలో ఉన్న శ్రీ సంగమేశ్వర దేవస్థానంకు వచ్చి సంగమేశ్వర స్వామిని దర్శనం చేసుకుని అభిషేకం పూజలో పాల్గొన్నారు. అనంతరం ఏపీవో కార్తీకమాస వనభోజనాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, చెన్నిపాడు గ్రామ నాయకులు వెన్నపూస రమణారెడ్డి, రామిరెడ్డి , టీడీపీ కార్యకర్త నరేంద్ర, భక్తులు పాల్గొని జయప్రదం చేశారు.

## పిల్లల ఆరోగ్యమే దేశ అభివృద్ధికి పునాది

### ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

### బాలల హక్కుల పై అవగాహన



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, నవంబర్ 15)
బాలల హక్కుల వారోత్సవాలు సందర్భంగా శనివారం కనిగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని బాలల ఆరోగ్య హక్కు పై ప్రజలకు, విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ ప్రతి బాలుడూ ఆరోగ్యంగా ఉండే హక్కు సంపూర్ణంగా రాజ్యాంగం ద్వారా కలిగిన ప్రాథమిక హక్కు అని, పిల్లల ఆరోగ్యం కాపాడడం తల్లిదండ్రులు, పాఠశాలలు, ప్రభుత్వం, సమాజం అందరి బాధ్యత అని తెలిపారు. బాలల హక్కులను కాపాడడంలో వారికి నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందే విధంగా పాఠశాలలో బాలల కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. బాలల ఆరోగ్య దృష్ట్యా జంక్ ఫుడ్ తినకుండా పిల్లలకు అవగాహన కల్పించాలని తెలిపారు.పిల్లలకు శుభ్రమైన నీరు, పోషకాహారం, సమయానికి టీకాలు, పరిశుభ్రమైన వాతావరణం లభించడం వారి ఆరోగ్య హక్కుకు కీలకమని చెప్పారు. అనారోగ్యానికి దారితీసే పోషకాహార లోపాన్ని నివారించడానికి ప్రభుత్వ పథకాలను పూర్తిగా వినియోగించుకోవాలని తెలిపారు. బాలల హక్కులను కాపాడటం మనందరి కర్తవ్యమని ప్రతి పిల్లవాడూ ఆరోగ్యంగా పెరుగడానికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సమాజం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, ఆర్‌డిఓ కేశవర్ధనరెడ్డి, డిఎల్‌డిఓ శ్రీనివాసరెడ్డి, కమిషనర్ కృష్ణ మోహన్‌రెడ్డి, ఎంఈఓ నారాయణరెడ్డి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు పార్వతి, సుమతి, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఐటీడీపీ అధ్యక్షులు అన్నపురెడ్డి అచ్యుత్ రెడ్డికి నివాళులు



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, నవంబర్ 15)
దోర్నాల మండలం చిన్న దోర్నాల గ్రామంలో ఐటీడీపీ అధ్యక్షులు అన్నపురెడ్డి అచ్యుత్‌రెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. అచ్యుత్ రెడ్డి పార్టీ కోసం ఎనలేని సేవలు చేశారని గుర్తుచేశారు. వారి కుటుంబానికి పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా అందించారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతతోనే ఆరోగ్య జీవనం

### జిల్లా కలెక్టర్ పి రాజాబాబు













(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 15)
ప్రతి ఒక్కరూ శుభ్రత పాటిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే ఆరోగ్యంతో పాటు ఆత్మ గౌరవంతో జీవనం సాగించవచ్చని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు పేర్కొన్నారు. శనివారం సంతనూతలపాడు మండలం, మద్దులూరు గ్రామ పంచాయతీ లో జరిగిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, స్థానిక ఎమ్మెల్యే బి ఎన్ విజయకుమార్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జిల్లా కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ ప్రతి నెలా మూడవ శనివారం జిల్లా వ్యాప్తంగా స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం జరుగుచున్నదన్నారు. అందులో భాగంగా ఈ రోజు సంతనూతలపాడు మండలం, ముద్దలూరు గ్రామంలో నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు స్థానిక శాసన సభ్యులు, అధికారులతో కలసి రావడం జరిగిందన్నారు. ప్రభుత్వం ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛత మీద ఒక కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. ప్రజల్లో శుభ్రత గురించి అవగాహన కల్పించడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఒక వ్యక్తి పరిశుభ్రంగా ఉంటే వారి కుటుంబం పరిశుభ్రంగా ఉంటుందని, తద్వారా సమాజ మంతా పరిశుభ్రంగా, ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేయడం వలన దోమలు, ఈగలు పెరిగి వ్యాధులు కలిగిస్తాయని, తడి, పొడి చెత్తలను వేరు చేసి డస్ట్ బిన్స్ లో వేయాలని తెలిపారు. వీధులు పరిశుభ్రంగా ఉండేలా చూడడం ప్రతి ఒక్కరి బాధ్యతని, ఈ విషయంలో సామూహికంగా కృషి చేయాలన్నారు. వీధులు, మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వాతావరణం, గాలి కూడా పరిశుభ్రంగా ఉంటాయని అన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, టాయిలెట్ కి వెళ్ళిన తర్వాత చేతులు సబ్బుతో కడుక్కోవాలి, తినే ఆహారం కూడా పరిశుభ్రంగా ఉండాలని తెలిపారు. ఎమ్మెల్యే బి. ఎన్ విజయకుమార్ మాట్లాడుతూ, స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా ఈ రోజు మద్దులూరు గ్రామానికి రావడం జరిగిదన్నారు. ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించడం చాలా ముఖ్యమన్నారు. అలాగే ఇంటితో పాటు పరిసరాలను ముఖ్యంగా సైడు కాలువలు, మురుగు కాలువలను ప్రతి రోజు శుభ్రంగా ఉంచుకోవాల్సిన భాద్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు. ప్రతి ఒక్కరు శుభ్రత పాటించినట్లయితే ఆరోగ్యకరమైన జీవనం సాగించకలుగతారన్నారు. అనంతరం పారిశుధ్య కార్మికులను శాలువ కప్పి సన్మానించడం జరిగింది. తొలుత జిల్లా కలెక్టర్, శాసన సభ్యులతో కలసి మద్దులూరు ఎస్. సి కాలనీని సందర్శించి కాలనీ ప్రజలతో మాట్లాడి, వ్యక్తిగత పరిశుభ్రత, రోజు వారీ క్లాప్ మిత్రాలకు తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వడం గురించి, చెత్త నిర్వహణ, తాగు నీటి వినియోగం, మరుగుదొడ్ల వినియోగం వంటి అంశాలపై స్వయంగా అడిగి తెలుసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు కమ్యూనిటి హాల్, బస్షెల్టర్, స్కూల్ ప్రహరి గోడ అవసరమని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, జిల్లా కలెక్టర్ స్పందిస్తూ, ఈ సమస్యలపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి చేతుల శుభ్రతపై విద్యార్ధులకు అవగాహన కల్పించి, పిల్లలతో కలసి స్వయంగా చేతులు కడిగి పరిశీలించారు. అనంతరం స్కూల్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, జిల్లా పరిషత్ సిఈఓ శ్రీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీమతి విజయ జ్యోతి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీ వెంకటేశ్వర రావు, మెప్మా పిడి శ్రీ శ్రీహరి, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

### నిర్వహించిన జిల్లా పోలీసులు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 15)
ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో తమ పాత్రను పోషిస్తూ ప్రకాశం జిల్లా పోలీసులు 'స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం (ప్రతి నెల మూడవ శనివారం) ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు మరియు సిబ్బంది కలసి జిల్లా పోలీసు కార్యాలయం సహా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమం చేపట్టారు. పోలీస్ కార్యాలయ ప్రాంగణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలను శుభ్రం చేసి, చెత్తను తొలగించారు. గుణపం, పారలు ఉపయోగించి పిచ్చి మొక్కలను తొలగించారు. ఇలా శుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ, పర్యావరణ పరిరక్షణకు తమ పాత్రను పోషించారు. మురుగునీటి పారుదల కాలువలను శుభ్రం చేసి, పరిసరాలను పరిశుభ్రం చేయడానికి బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రం చేశారు. అనంతరం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ ను కూడా చేశారు. అన్ని పోలీస్ స్టేషన్ లలో పోలీస్ అధికారులు మరియు సిబ్బంది కలసి శుభ్రం చేయడంతో పాటు ఆవరణం మరియు చుట్టూ ఉన్న చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. గుణపం, పారలు చేతబట్టి పిచ్చి మొక్కలు తొలగించారు. చెట్లకు పాదులు తీసి నీరు పోశారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే విధంగా ఈ కార్యక్రమం చేపట్టారు. మన చుట్టుపక్కల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన వాతావరణం నెలకొంటుందని అందువలన మనసు ప్రశాంతతతో కూడి ఆరోగ్యకర వాతావరణంలో, క్రమశిక్షణగా విధులు నిర్వర్తించొచ్చు. మన చుట్టూ ఉంటే పరిసరాలను పరిశు భ్రంగా ఉంచడం మన బాధ్యత. సమాజంలో శాంతియుత వాతావరణం, పరిశుభ్రమైన వాతావరణం రెండూ సమానంగా ముఖ్యమని భావించి పోలీస్ అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.





## విశాఖలో సీఐఐ సదస్సు ఏపీకి భారీ పెట్టుబడులు

### బీజేపీ నేత డాక్టర్ ఏలూరి సంతోషం



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, నవంబర్ 15)
విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా భారీ అవకాశాల్ని తీసుకొస్తోందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం జరిగిన తొలి రోజు సదస్సులోనే ఏపీకి రికార్డు స్థాయిలో పెట్టుబడులు చేరటం రాష్ట్రానికి గర్వకారణమని అన్నారు. మొత్తం 400 ఎంవోయూలు కుదిరి, రూ. 11,91,972 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రావడం ఎంతో హర్షనీయమన్నారు. వీటి ద్వారా 13,32,445 కొత్త ఉద్యోగాలు సృష్టించబోతుండటం రాష్ట్ర యువతకు ఎంతో మేలు చేస్తుందని చెప్పారు.. సీఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో జరిగిన కార్యక్రమంలోనే 41 ఎంవోయూలు, వాటి ద్వారా రూ. 3.50 లక్షల కోట్ల పెట్టుబడులు మరియు 4.16 లక్షల ఉద్యోగాలు నమోదుకావడం ఎంతో సంతోషించదగ్గ విషయం అన్నారు.. మంత్రుల సమక్షంలో మరో 324 ఎంవోయూలు కుదిరి, వాటి ద్వారా రూ. 8,41,786 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి చేరుతుండటం విశేషం అన్నారు.. అలాగే రెండో రోజు కూడా లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు.. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఎంతో కృషి చేశారని.. ముఖ్యంగా కేంద్రమంత్రులను రాష్ట్రానికి తీసుకొచ్చి ఏపీలో పెట్టుబడుల అవకాశాలను పెంచారని కొనియాడారు.. వారిద్వారా ఈ కార్యక్రమం మహా గొప్పగా విజయవంతం అయిందని అన్నారు.. మాధవ్ గారు మొదటి నుంచి కూడా ఏపీకి పెట్టుబడులు తీసుకురావడంలో ఎంతో శ్రమిస్తున్నారని చెప్పారు.. ముఖ్యంగా కేంద్ర సంస్థలు ఎన్నో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని ఏలూరి.. ఇందులో మాధవ్ గారి పాత్ర కీలకం అని తెలిపారు.. డా. ఏలూరి ఇంకా మాట్లాడుతూ, ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారి సహకారం, రాష్ట్రానికి దూరదృష్టి కలిగిన నాయకుడు చంద్రబాబు నాయుడు నాయకత్వం, క్రమబద్ధతతో ముందుకు నడిపిస్తున్న నారా లోకేష్ పాత్ర.. ఇవన్నీ కలిసి ఆంధ్రప్రదేశ్‌ను వేగంగా అభివృద్ధి దిశగా తీసుకెళు _న్నాయని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌ను పరిశ్రమల కేంద్రంగా మలచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు రాబోయే రోజుల్లో మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేలా కనిపిస్తున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు మంత్రి నారా లోకేష్ , టీజీ భరత్ లకు అభినందనలు తెలిపారు.

# ఉచిత ఇసుక అమలు చేయాలి

**భవననిర్మాణ కార్మిక సంఘం నాయకులు**
**నవంబర్ 20న మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం దగ్గర**
**జరిగే ధర్నాలో పాల్గొనండి**
**సంక్షేమ బోర్డు పథకాలు అమలుచేసే వరకు మా పోరాటం ఆగదు**
**సిఐటియు గౌరవాధ్యక్షులు సయ్యద్ కొత్తూరు**



(షణ్ముఖ వెలుగు, కంభం, నవంబర్ 15)

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ అమలు చెయ్యకుండా సుమారు. సంవత్సరంన్నర కాలయాపన చేసింది. వెల్ఫేర్ బోర్డులో డబ్బులు ఉన్న భవన కార్మికులకు సంక్షేమ పథకాలు ప్రారంభించటంలేదు. వచ్చే నెలలో ఇస్తాం, ఆ పై నెలలో ఇస్తాం అని కాలం గడపడమే తప్ప సంక్షేమ పథకాలు ప్రారంభం కాలేదు. వెంటనే బిల్డింగ్ వర్కర్లందరికీ చట్టప్రకారం అమలుకావాల్సి సంక్షేమ పథకాలు ప్రారంబించాలని, ఉచిత ఇసుక అమలు చేయాలని నవంబర్ 20 వ తేదీన మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం దగ్గర జరుగుతున్న ధర్నాలో అత్యధిక మంది భవన నిర్మాణ కార్మికులు పాల్గొనాల్సిందిగా (సిఐటియు)ఏపి బిల్డింగ్, అధర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా కంభం మండలం భవననిర్మాణ కార్మికసంఘం ప్రధానకార్యదర్శి షేక్ ఖాజావలి, గౌరవ అధ్యక్షులు సయ్యద్ కొత్తూరు, ఉపాధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా, ప్రకాశంజిల్లా ప్రధానకార్యదర్శి షేక్. అన్వార్ భాష మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందని, కార్మికుల సంక్షేమ పథకాలు ఆపివెయ్యటం సమర్ధనీయమైన చర్యకాదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక సంక్షేమ పథకాలను ప్రారంభిస్తామని ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ గత ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. తమ ఉమ్మడి ఎన్నికల మ్యానిఫెస్టోలో కూటమి పార్టీలు ఈ హామీని పొందుపర్చారు. సంవత్సరన్నర కాలం పూర్తి అయిన నేటికీ సంక్షేమ పథకాల అమలు గురించిన ఊసెత్తడంలేదు. సంక్షేమ పథకాలు ప్రారంభించాలని కార్మికశాఖా మంత్రిని కలిసిన ప్రతిసారి మీరు లేకపోతే మా కూటమి ప్రభుత్వమే లేదని మీరు ఓట్లు వేసారుకాబట్టే కూటమి పార్టీలు గెలిచి అధికారంలో ఉన్నాయని వెంటనే సంక్షేమ పథకాలను ప్రారంబిస్తూ ఫైల్ పై సంతకం చేస్తామని మాటలు చెప్తున్నారే తప్ప అమలు చెయ్యడం లేదన్నారు.

**ఉచిత ఇసుక అమలు ఎక్కడ**
**గౌరవ అధ్యక్షులు సయ్యద్ కొత్తూరు**

గత ఎన్నికప్పుడు వై.సి.పి. ప్రభుత్వం ఇసుకను మాఫియా చేస్తుందని ఇసుక ఉచితంగా ఇవ్వకపోవడంతో భవన నిర్మాణకార్మికులకు ఉపాధిలేదని ఎన్నికలప్పుడు ప్రచారంచేసిన కూటమి నాయకులు ఇప్పుడు గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం గత ప్రభుత్వంకంటే టన్ను ఇసుకను రూ.1200 నుండి రూ.1400 ల వరకు అమ్ముకుంటున్నారు. పశ్చిమ ప్రాంతంలో ఇసుక రీచ్లు లేకపోవడంతో నెల్లూరు జిల్లా సంఘం నుండి ఈ ప్రాంతానికి ఇసుకను కాంట్రాక్ట్ రవాణాచేసి అధికధరలకు అమ్ముతున్నారు. కూటమి ప్రభుత్వం ఇసుకను కాంట్రాక్టరుకు ఇవ్వకముందు లారి యజమానులు గృహనిర్మాణ దారులకు టన్ను ఇసుక 600 నుండి 700 రూపాయలకు ఇస్తున్నారు. ఇసుకను ప్రస్తుతం కాంట్రాక్టర్కు అప్పగించడంతో గృహ యజమానుల దగ్గర నుండి టన్ను రూ.1200 నుండి రూ.1400ల వరకు అమ్ముతున్నారు. పశ్చిమ ప్రాంతంతో ఉచిత ఇసుక అమలు కావట్లేదు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నుండి సంక్షేమ పథకాలు అమలుచేయక, ఉచిత ఇసుక అమలుకాక అన్ని విధాల భవణ నిర్మాణ కార్మికులు నష్టపోతున్నారు. మరో పక్క పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాలు తమ రాష్ట్రంలోని భవన కార్మికులకు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలన్నింటిని అమలుచేస్తూ అదనంగా కొత్త పథకాలు ప్రారంభించాయి. ప్రమాద మరణానికి ఇస్తున్న 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని 10 లక్షల రూపాయలకు పెంచాలని తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలు నిర్ణయించి అమలుచేస్తున్నాయి. భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు స్కాలర్ షిప్లు, కార్మిక కుటుంబాలకు ఆరోగ్యపరీక్షలు తదితర సదుపాయాలు కల్పిస్తున్నాయి. మన రాష్ట్రంలోని కార్మికులకు మాత్రం రాష్ట్ర ప్రభుత్వం మాటలు చెప్తున్నది తప్ప పథకాలు ప్రారంభించడంలేదు.

కార్మికుల సంక్షేమం కోసం ఒక ప్రత్యేకమైన చట్టాన్ని పోరాడి సాధించుకున్న స్ఫూర్తితో నేడు ఆగిపోయిన సంక్షేమ పథకాలని ప్రారంభించాలని, ఉచిత ఇసుక అమలు చేయాలని మరొక పోరాటానికి కార్మికులను సమాయత్తం చేయాలని నవంబర్ 20 వ తేదీన మార్కాపురం సభకలక్టర్ కార్యాలయం దగ్గర జరిగే ధర్నాలో అత్యధిక సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు భాగస్వామ్యం కావాలని ఎపి బిల్డింగ్, అధర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపునిస్తుందని మా పిలుపు మేరకు కార్మికులు అందరూ భారీసంఖ్యలో పాల్గొననాలని లింగోజిపల్లె లో జరిగిన కార్మికుల సమావేశంలో పిలుపునిచ్చారు.

# రాష్ట్ర రాజధాని జిల్లాలోనూ అమలు గాని ఎస్సీ, ఎస్టీ యాక్ట్

**దళిత హక్కుల నేత నీలం నాగేంద్రరావు**



(షణ్ముఖ వెలుగు, గుంటూరు, నవంబర్ 15)

రాష్ట్ర రాజధాని ఉన్న గుంటూరు జిల్లాలోనూ ఎస్సీ, ఎస్టీ యాక్ట్ అమలు కావడం లేదని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం గుంటూరు నగరంలోని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ యాక్ట్ అమలుపై జరిగిన సమీక్ష సమావేశంలో పలు కేసుల్ని సమీక్షించారు. సమావేశానికి హాజరైన బాధితులతో నాగేంద్ర మాట్లాడారు. న్యాయపరమైన సలహాలు ఇచ్చారు. అనంతరం నాగేంద్రరావు మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్లో కేసు నమోదయిన దగ్గర నుంచి, కోర్టుల్లో జడ్జిమెంట్ వచ్చేవరకు ప్రతి దశలోనూ జాప్యం జరుగుతుందన్నారు. చుండూరు మారణకాండ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టానికి పురుడు పోసిన గుంటూరు జిల్లాలో, ఎస్సీ ఎస్టీ అమలు కాకపోవటం దారుణం అన్నారు. ఎస్సీ, ఎస్టీ బాధితులు పెట్టే కేసులు ఫాల్సు గా రిఫర్ చేసినా కూడా, ఎఫ్ఐఆర్ లో పేర్కొన్న బాధితులందరికీ ఎఫ్ఐఆర్ స్టేజి రిలీఫ్ ఇవ్వటం లేదన్నారు. ఫాల్స్ గా రిఫర్ చేసిన కేసుల రిఫర్ చార్జిషీట్లను కోర్టులో దాఖలు చేయకుండానే, బాధితులకు ఎండార్స్మెంట్ ఇస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ కోర్టుల్లో విచారణ జరిగే కేసుల్లో ఎస్సీ ఎస్టీ ఆక్ట్ కేసుల సంఖ్య కంటే, ఇతర కేసుల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. గుంటూరు జిల్లాలో 4 వేలకు పైగా కేసుల్లో పెండింగ్లో ఉన్నాయని, 6 వందల కేసుల్లో ఛార్జ్ షీటు దాఖలు చేయలేదన్నారు. గుంటూరు జిల్లాలో పెండింగ్ కేసుల క్లియరెన్స్ కు కనీసం ఐదుగురు ఎస్సీ ఎస్టీ డిఎస్పీలను ప్రభుత్వం నియమించాలన్నారు. సంచలనం సృష్టించిన కేసుల్లోనే ఎస్సీ, ఎస్టీలకు తక్షణ రిలీఫ్ అందుతుందని, ప్రచారం లేని కేసులకు ప్రాధాన్యం ఇవ్వటం లేదన్నారు. మూడు సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని నియమించలేదన్నారు. కనీసం అధికారులైన ఎస్సీ, ఎస్టీ యాక్ట్ అమలను అధికారికంగా సమీక్షించలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం రాజధాని జిల్లాలో అంటరాని చట్టంగా మారిపోయిందని, చట్టం అమలు కోసం మంగళవారం జిల్లా కలెక్టర్ తమీం అన్సారియాతో సమస్యలు చర్చిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో పోలీసు నుండి ప్రభుత్వం నుండి స్పందన లేనివారు దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యాలయంలో సంప్రదించాలన్నారు. దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు సునీల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో, సీనియర్ న్యాయవాది కె. రాజేష్, దళిత బహుజన ఫ్రంట్ నాయకులు కొరివి వినయ్ కుమార్, ఐలా మాణిక్యాల రావు, రావినూతల కమల కుమారి, పొందుగల ప్రకాష్, లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి. చంద్ర నాయక్, దళిత నాయకులు కాకుమాను రవి, తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛంధ్ర - స్వర్ణాంధ్ర పై అవగాహన




(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, నవంబర్ 15)

ఉలవపాడు జి.వి.ఎస్.ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛంద్రా - స్వర్ణాంధ్ర లో భాగంగా శనివారం వ్యక్తిగత , సమాజ పరిశుభ్రత అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్చార్జి ప్రిన్సిపాల్ డి సుజాత మాట్లాడుతూ విద్యార్థులందరూ తమ వ్యక్తిగత పరిశుభ్రత పట్ల అవగాహన కలిగి ఉండి సమాజంలో మన తోటి వారికి కూడా అవగాహన కల్పించాలని తెలిపారు. కాలకృత్యాలు తీర్చుకున్న తర్వాత, భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలి. బహిరంగ మల, మూత్ర విసర్జన చేయడం గురించి గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించి మన పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆంగ్ల అధ్యాపకులు వి.ఎస్. ప్రసన్న కుమార్ మాట్లాడుతూ గృహాల నుండి వచ్చే చెత్తను ఏవిధంగా విభజన చేసి పంచాయతీ లేదా మున్సిపాలిటీ వారికి అందించాలో వివరించారు. మన కళాశాలను, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు విద్యార్థులు తమ సహకారం అందించాలని తెలిపారు. అనంతరం కళాశాల విద్యార్థులు, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు, సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.




## తర్లుపాడులో కెవిఆర్ పాలి క్లినిక్ ప్రారంభం

**ప్రారంభించిన ఎస్ ఐ బ్రాహ్మనాయుడు**



(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, నవంబర్ 15)

తర్లుపాడు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉద్దేశించిన కెవిఆర్ పాలి క్లినిక్‌ను శనివారం ఎస్ఐ బ్రహ్మనాయుడు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ క్లీనిక్‌లో ఎంబిబిఎస్ డాక్టర్ సిహెచ్ వాసవి సేవలు అందిస్తారు. ఈమె జనరల్ లేడీస్ స్పెషలిస్ట్‌గా గుర్తింపు పొందారు. క్లీనిక్‌లో ముఖ్యంగా జనరల్ స్పెషలిస్ట్ సేవలు, లేడీస్ స్పెషలిస్ట్ సేవలు, సర్జికల్ సేవలు, న్యూరో సంబంధిత సేవలు అందుబాటులో ఉన్నాయి. ఈ సేవలను అందించేందుకు ఆధునాతనమైన పరికరాలను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. తర్లుపాడు మరియు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ నూతనంగా ప్రారంభించిన కె.వి.ఆర్. పాలి క్లినిక్‌లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల సౌకర్యార్థం 24 గంటల అంబులెన్స్ సదుపాయం కూడా క్లినిక్‌లో అందుబాటులో ఉందని వారు తెలియజేశారు. మరిన్ని వివరాల కోసం, క్లినిక్ నిర్వాహకులను 8688905558 చరవాణి నంబర్ ద్వారా సంప్రదించవచ్చన్నారు.

## తర్లుపాడులో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు





(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, నవంబర్ 15)

శాఖా గ్రంథాలయం తర్లుపాడు నందు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగినది. పుస్తక ప్రదర్శన కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు పాఠకులు పాల్గొని తిలకించారు. తర్లుపాడు మండల పరిషత్ హిందూ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రాహేలమ్మ పాల్గొని పుస్తక పఠనం గురించి విద్యార్థిని, విద్యార్థులకు పుస్తక పఠనం అలవాటుగా మార్చుకొని ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదివి ఎంతో మేధాశక్తిని సంపాదించవచ్చునని తెలిపారు. డాక్టర్ అబ్దుల్ కలాం ఆయనకు పుస్తకాలు అంటే అత్యంత ప్రేమ. ఆయన రాష్ట్రపతి స్థాయికి ఎదిగినా కానీ ఎక్కడైనా స్కూల్‌కి వెళ్లి విద్యార్థుల పుస్తకం చదివితే ఎటువంటి నాలెడ్జి వస్తుందో వివరించారు. మీరు కూడా ప్రతి విద్యార్థిని, విద్యార్థులు గ్రంథాలయంలో అనేక రకాలైన పుస్తకాలు ఉంటాయి కనుక మీరందరూ పుస్తకాలను చదివి మంచి భవిష్యత్తును పొందాలని విద్యార్థులకు తెలియజేశారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకోవాల్సిందిగా విద్యార్థిని విద్యార్థులకు తెలిపారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, గేమ్స్, అలాగే డస్టర్ గేమ్స్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి విద్యార్థినీ, విద్యార్థులు 50 మంది పాల్గొనడం, అలాగే ఉపాధ్యాయులు ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయురాలు విజయ, కృష్ణకుమారి స్పందన స్కూల్ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం గ్రంథ పాలకుడు పివి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.

## అవాస్ 2.0 సర్వేను తనిఖీ చేసిన హౌసింగ్ డిఈఈ బి భాళోజి నాయక్



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, నవంబర్ 15)

తాళ్లపల్లిలో జరిగే అవాస్ 2.0 సర్వేలో హౌసింగ్ డిఈఈ బాళోజి నాయక్ పాల్గొని సొంత స్థలం ఉండి ఇల్లు లేని లబ్ధిదారులు తమ యొక్క వివరాలు, స్థలంను ఆవాస్ యాప్‌లో నమోదు చేయించుకున్న వారికి మాత్రమే ప్రభుత్వం పక్కా ఇల్లు మంజూరు చేస్తుందని, ఈ యొక్క సర్వే ప్రతి గ్రామంలో జరుగుతుందన్నారు. నవంబర్ 30 వరకు మాత్రమే ఇందుకు చివరి తేదీ అని తెలిపారు. కావున ప్రతి యొక్క లబ్ధిదారుడు ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పలు సూచనలు తెలియచేశారు. ఈ కార్యక్రమం లో హౌసింగ్ ఏఈ మరియా దాస్, వర్క్ ఇన్స్పెక్టర్ టి అలీ, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ వై సాయి ప్రియా, తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్తను పరామర్శించిన పిన్నెల్లి



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, నవంబర్ 15)

మాచర్ల పట్టణం 24వ వార్డుకు చెందిన బండారు చెన్నయ్య కుమారుడు బండారు శ్రీనివాసరావు అనారోగ్యంతో ఇటీవలే వైద్యం చేయించుకొని హాస్పిటల్ నుంచి డిశ్చార్జి అయ్యారు. విషయం తెలుసుకున్న పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వారి ఇంటికి వెళ్లి పరామర్శించి, మెరుగైన వైద్యం కోసం రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు.

## నేడు రెడ్డి వన భోజన మహోత్సవం

**హాజరుకానున్న వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులు**
**రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు**



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 15)

రెడ్ల కార్తీక మాస వన భోజన మహోత్సవ కార్యక్రమాన్ని 16వ తేదీ ఆదివారం మల్లవరంలోని గుండ్లకమ్మ రిజర్వాయర్ నందు నిర్వహిస్తున్నట్లు రెడ్డి జనాభ్యుదయ సంఘం అధ్యక్షులు కెవి రమణరెడ్డి తెలిపారు. ఒంగోలులోని రెడ్డి హాస్టల్ నందు జరిగిన సమావేశంలో కార్యక్రమం వివరాలను ఆయన వెల్లడించారు. రెడ్డి జనాభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో వన బోజన మహోత్సవ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులతో పాటు ఆర్థికంగా, రాజకీయంగా, వ్యాపారవేత్తగా స్థిరపడిన ప్రముఖుల హాజరు అవుతారని తెలిపారు. కార్యక్రమంలో పూజ కార్యక్రమాలు, ఆట పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వన బోజన మహోత్సవాలకు విచ్చేసే రెడ్డి కుటుంబ సభ్యులకు వాహన సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సోదర, సోదరీమణులు అందరూ పాల్గొని విజయవంతం చేసి ఐక్యత చాటాలని కోరారు. సమావేశంలో పలగాని రామసుబ్బారెడ్డి, పోలవల్లి నరసింహారెడ్డి, హాస్టల్ ఫౌండర్ పి వెంకటరామిరెడ్డి, వెన్నపూస వెంకటేశ్వరరెడ్డి, నల్లమలపు బ్రహ్మారెడ్డి, ఎన్ఎల్ నరసారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సమరశీల పోరాటం ద్వారానే సమస్యల పరిష్కారం

**కార్మికుల జీవితాలు మారాలంటే ప్రజా ప్రభుత్వాల ద్వారానే**
**ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలో వక్తలు**



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 15)

సమరశీల పోరాటం ద్వారానే సమస్యల పరిష్కారం దొరుకుతుందని, కార్మికుల జీవితాలు మారాలంటే ప్రజా పోరాటాలు తప్పవని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శనివారం నాడు ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) 15 వ రాష్ట్ర మహాసభల సందర్భంగా ప్రకాశం జిల్లా ఒంగోలు కొత్త మార్కెట్ సెంటర్ వద్ద జరిగిన బహిరంగ సభలో పలువురు నేతలు పాల్గొన్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షులు కె నాగభూషణం అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎంఎల్సి బొర్రా గోపి మూర్తి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినప్పటికి ఉద్యోగ, కార్మిక, కర్షకుల జీవితాల్లో మార్పులు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వెట్టి చాకిరీ నుంచి విముక్తి పొందాలని, కనీస వేతనం అమలు చేయాలనీ, తమ సేవలు ప్రభుత్వం గుర్తించి రెగ్యులర్ చేయాలని కార్మికులు కోరుకుంటుంటే ఈ ప్రభుత్వాలకు వీటి అమలుకు చేతులు రావడం లేదని దుయ్య బట్టారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడి దారివర్గాల ప్రయోజనం కోసం చట్ట సభల్లో కృషి చేస్తున్నాయి తప్ప ఏ ప్రభుత్వం కూడా కార్మికులు, ఉద్యోగులు, కర్షకుల ప్రయోజనాలు గురించి చర్చ చేసే పరిస్థితి లేదని తీవ్రంగా మండిపడ్డారు.సమానపనికి సమాన వేతనం, అప్కాస్ కాదు, కాంట్రాక్ట్ కాదు రెగ్యులర్ చేయాలని, సెలవులు, పనిచేసే చోట సౌకర్యాలు, భద్రత పనిముట్లు, పని గంటల అమలు, కార్మికుల సంక్షేమం కోసం శాసనమండలి పిడిఎఫ్ పట్టుబడుతుంటే, కూటమి లోని బిజెపి, టీడీపీ, జనసేన తో పాటు ప్రతిపక్షం వైసీపీ కూడా కార్పొరేట్ దిగ్గజం ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి ప్రతిపాదించిన 10 గంటలు అవసరం అనుకుంటే 13గంటలకు బిల్లు అమోదించుకున్నారని దునుమాడారు.కూటమి అధికారం చేపట్టి 18,నెలలు అవుతున్నప్పటికి ప్రజా సమస్యలు పక్కన పెట్టి కార్పొరేట్లకు అనుకూలంగా పనిగంటల మార్పు బిల్లుతో పాటు, రాత్రి వేళల్లో మహిళలు పని చేసే బిల్లును అమోదించడం పట్ల తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. 175మంది సభ్యులు ఉన్న శాసనసభలో వైసీపీ వాకౌట్ చేసింది తప్ప వ్యతిరేకంగా ఓటు చేయకపోవడం వెనుక కార్పొరేట్ వర్గ స్వభావం వ్యక్తం అవుతుందన్నారు. రాత్రి పూట మహిళలు పని చేసేవిషయంలో స్త్రీ పురుషులు సమానంఅని వక్రభాష్యం చెప్పే మంత్రి కాబినెట్ లో,ఎం ఎల్ ఏ సీట్లు కేటాయింపు లో 50శాతం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అటు కూటమి,ఇటు వైసీపీ రెండూ మోడీ విధానాలను అమలు



చేయడానికి పోటీ పడుతున్నట్లు ధ్వజమెత్తారు.కార్మిక చట్టాల స్థానే లేబర్ కోడ్ అమలు కు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లు అంశాన్ని ఈ సందర్భంగా ప్రస్థావించారు. శాసన మండలి లో 58 సభ్యులకు 38,మంది వైసీపీ సభ్యులు ఉండగా కూటమి ప్రవేశపెట్టే ఏ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయకపోవడం విచారకరం అన్నారు. మండలి లో వాకౌట్ చేసి బిల్లు ఆమోదం పొందేందుకు వైసీపీ దోహద పడుతున్నట్లు విమర్శించారు. ఈ ముఖ్యమంత్రి నచ్చకుంటే ఆ ముఖ్యమంత్రి, ఆ ముఖ్యమంత్రి నచ్చకుంటే ఈ ముఖ్యమంత్రి కి ఓటు వేసే పద్ధతిని మార్చుకుని ప్రజా పక్షం వహించే వ్యక్తులను చట్టసభలకు పంపించాలని ఆ దిశగా కార్మికులు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి సిహెచ్ నరసింగరావు మాట్లాడుతూ కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలను పోరాటాల ద్వారానే ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టగలమని స్పష్టం చేశారు. అటు కేంద్రం ఇటు రాష్ట్రం వర్క్ కాంట్రాక్ట్ విధానం పేరుతో ఉన్న ఉద్యోగులను తొలగించి పీస్ రేట్ పద్దతిలో వెట్టి చాకిరీ చేయించుకుని సంపదను కంపెనీలకు దోచిపెట్టేందుకు చట్టాలను మార్పు చేస్తున్నట్లు దునుమాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు 62ఏళ్ల వయోపరిమితి పెంచి, కాంట్రాక్ట్ ఉద్యోగులకు 50ఏళ్ల కు తొలగించే చర్యలు చేపడుతున్నట్లు విమర్శించారు. అగ్నివీర్ పేరుతో సైన్యంలో ను రెగ్యులర్ ఉద్యోగులను తొలగించడం, తద్వారా సంపద ను కార్పొరేట్ల కు దోచిపెట్టేందుకు మోడీ తీవ్ర కృషి చేస్తున్నారని ఆరోపించారు. కృష్ణపట్నం పోర్ట్, గంగవరం పోర్ట్ వంటి ప్రభుత్వ సంస్థ లను ఆదాని కి కట్టబెట్టిన మోడీ విశాఖ ఉక్కును సైతం ప్రైవేటికరించే ప్రయత్నం చేస్తున్నట్లు ఈ సందర్బంగా గుర్తు చేశారు. ఇందులో భాగంగా గత అక్టోబర్ నుంచి ఈ అక్టోబర్ వరకు 10 వేల మంది రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించినట్లు పేర్కొన్నారు ఇదిలా ఉండగా 33శాతం ఉన్న కార్పొరేట్ పన్ను24శాతం తగ్గించి ఈ లోటు ను పూడ్చడానికి పెట్రోల్ ధరలు పెంచిన వైనాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రం లో కార్పొరేట్ కంపెనీలకు చంద్రబాబు నాయుడు ఎర్ర తివాచి పరచి సంపదను దోచిపెడుతునట్లు దుయ్యబట్టారు. సిఐఐ సమ్మిట్ లో రూ.11.92 లక్షల కోట్లు పెట్టుబడుల ఒప్పందం జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన, గతంలో ముఖ్యమంత్రిగా ఇదే తరహా పెట్టుబడులు వచ్చినట్లుగా ప్రకటించిన వైనాన్ని ఈ సందర్బంగా గుర్తు చేశారు. కేరళ లో ఏ కార్పొరేట్ కంపెనీ అయినా కార్మికులకు అనుకూలంగా వ్యవహరించకుంటే కంపెనీ మూసి వేయించే చట్టం అమలు వల్ల లులు కంపెనీ మూత వేసివిశాఖపట్నం తరలి వచ్చినట్లు తెలిపారు. ఇక్కడ చంద్రబాబు ప్రభుత్వం విశాఖ బీచ్ వద్ద అప్పనంగా ప్రభుత్వ స్థలం అప్పగించి రూ 170 కోట్ల రాయితీ ఇచ్చినట్లు విమర్శించారు. కష్టజీవుల ప్రయోజనం కాపాడే కేరళ తరహా పాలన కోసం కార్మిక, కర్షక సమరశీల పోరాటం నిర్మించాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ నాడు విజన్ 2020 పేరుతో ప్రజల్ని మోసగించిన చంద్రబాబు నేడు విజన్ 2047 పేరుతో మరోసారి దగా చేస్తున్నాడని ధ్వజమెత్తారు. కేంద్రంలో డబల్ ఇంజన్ సర్కార్ ప్రజల్ని మోసం చేస్తుంటే రాష్ట్రం లో త్రిబుల్ ఇంజన్ సర్కార్ మోసానికి తెగబడుతున్నట్లు దుయ్యబట్టారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా కష్ట జీవుల జీవితాలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల జీవితాలను ఫణంగాపెట్టి సంపదను కార్పొరేట్ల కు దోచిపెట్టడం లో మోడీ ప్రభుత్వం, కూటమి ప్రభుత్వం పోటీ పడుతున్నట్లు ధ్వజమెత్తారు. బంగారు కుటుంబాల పేరుతో పేదలను దత్తత తీసుకునే పి4 ప్రక్రియ తో ప్రజలను దగా చేస్తున్నట్లు దుయ్యబట్టారు. కార్మికుల కనీస వేతనం రూ 26 వేలు అమలు చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ, వంటి సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తుంటే 2047 నాటికి జీవితాలు మారుస్తానని ప్రకటించడం దగా చేయడమే నన్నారు. పి 4 ప్రక్రియ తో బానిసలుగా మార్చేందుకు కుట్ర చేస్తున్నట్లు ఆరోపించారు.పేదల పక్షిపాతిగా ప్రకటించుకునే చంద్రబాబుకు పెట్టుబడి దారులపై ఉండే ప్రేమ పేదలపై లేదన్నారు. ఈ విధానాలను మార్చేందుకు 98,శాతంగా ఉన్న ప్రజలు సమరశీల పోరాటాలకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు.సభలో మున్సిపల్ ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు చీకటి శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యం రమేష్ మాట్లాడారు. కాగా సభలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పికల్పన,సంఘ ఉపాధ్యక్షులు కె సామ్రాజ్యం, టి నూకరాజు, పి వెంకటరెడ్డి, ఎన్ వై నాయుడు, కార్యదర్సులు వరికూటి రాజు, బి ముత్యాలరావు, కె పెంచలనరసయ్య, ఎస్ జ్యోతి బసు సిఐటియు ఒంగోలు నగర కన్వీనర్ టి. మహేష్, మున్సిపల్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## 17న గాయత్రి వైభవం పై ప్రసంగం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 15)

విశ్వ కళా భారతి 24వ వార్షికోత్సవాన్ని ఈ నెల 17వ తేదీ సోమవారం సాయంత్రం 5 గంటలకు ఒంగోలు జిల్లా కేంద్ర గ్రంధాలయంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు నాదెండ్ల జ్వాలా ఉమా మహేశ్వర శర్మ వెల్లడించారు. కార్యక్రమానికి అక్షర సాహితీ సమితి అధ్యక్షులు ఎం వి ఎస్ శాస్త్రి అధ్యక్షత వహిస్తారు. ఎన్ వి సీతారామ శర్మ... ఉషశ్రీ జ్యోతి ప్రజ్వలన చేస్తారు, జిల్లా ఖజానా శాఖ అధికారి అన్నా పంతుల జగన్నాథ రావు ముఖ్య అతిథిగా పాల్గొంటారు, జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ జి వి శివా రెడ్డి , ఉప గ్రంథ పాలకురాలు కాళహస్తి సంపూర్ణ, తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంట్ రావినూతల రామకృష్ణ ఆత్మీయ అతిథులుగా విచ్చేస్తారు, అష్టావధాని ఇలపావులూరి శేష శ్రీధర్ శర్మ వేదమాత గాయత్రి వైభవం అనే అంశం పై ఉపన్యసిస్తారు, మార్తాటి ఈశ్వరీ గోపాలరావును విశ్వ కళా భారతి పురస్కారంతో సత్కరిస్తారు. జిల్లా ఖజానా శాఖ అధికారి అన్నాపంతుల జగన్నాథరావు, జంధ్యాల కామేశ్వరి తదితరులు పోతన విరచిత భాగవత పద్యాలను ఆలపిస్తారు, సాహిత్యాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్ నిర్మాణంకు స్థల పరిశీలన



(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, నవంబర్ 15)

మండలంలోని పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న స్థలాన్ని ఎస్సి వెల్ఫేర్ హాస్టల్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న మరియు కస్తూర్బా గాంధీ పాఠశాల యందు జూనియర్ కాలేజీ భవనం పనులను పరిశీలిస్తున్నఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆయన మాట్లాడుతూ త్వరగా భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులను సూచించారు. విద్యార్థులతో మాట్లాడి ఏర్పాట్లు గురించి ఎమ్మెల్యే తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి




(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, నవంబర్ 15)

మార్కాపురం మండల పరిషత్ కార్యాలయం నందు స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించడం అయినది. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, తద్వారా సమాజ పరిశుభ్రత వస్తుందని, పరిశుభ్రమైన సమాజం ఆరోగ్యవంతమైన సమాజాన్ని రూపొందిస్తుందని, తద్వారా దేశం అభివృద్ధి చెందుతుందని ఎంపీడీవో ఏ బాల చెన్నయ్య తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీల వీవోలు, మహిళా సంఘాల కార్యకర్తలు, ఎంజిఎన్ఆర్జిఎస్ సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఏపిఎం పిచ్చయ్య పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్
# 15వ రాష్ట్ర మహాసభల సందర్భంగా కదం తొక్కిన కార్మికులు




















**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 15)**

కనీస వేతనం అమలుతో పాటు తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, బానిస బతుకుల నుంచి విముక్తి చేయాలని నినదిస్తూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు కదం తొక్కారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ 15వ రాష్ట్రమహాసభలను పురస్కరించుకొని శనివారం నాడు ప్రకాశం జిల్లా ఒంగోలులో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి 26 జిల్లాలకు చెందిన మున్సిపల్ కార్మిక సంఘ నేతలు, కార్మికులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. మహా సభల సూచకంగా 15 జెండాలు చేతపట్టిన మహిళా కార్యకర్తలు అగ్రభాగాన కదలి రాగా రాష్ట్ర నలుమూలలకు చెందిన వివిధ సంస్కృతులను ప్రదర్శిస్తూ కళాకారుల ప్రదర్శనలతో ర్యాలీ సాగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నయా ఉదార వాద విధానాలను వ్యతిరేకిస్తూ.కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతన చట్టం అమలు చేయాలని,రాష్ట్ర ప్రభుత్వం సవరించిన పనిగంటల చట్టం రద్దు చేయాలని. వేతనాల పెంచాలని,డిమాండ్ చేస్తూ కార్మికులు నినదించారు. రాజకీయ వేధింపులు మానుకోవాలని,కార్మికుల అక్రమ తొలగింపు చర్యలు రద్దు చేయాలని కార్మికులు గళమెత్తారు. మున్సిపల్ కార్మికుల ర్యాలీకి సంఘీభావం ప్రకటిస్తూ పిడిఎఫ్ శాసనమండలి సభ్యులు బొర్రా గోపిమూర్తి ర్యాలీలో అగ్ర భాగాన నడిచారు.మున్సిపల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె నాగభూషణం, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి హెచ్ నరసింగరావు, మున్సిపల్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె ఉమామహేశ్వరరావు,మున్సిపల్ ఫెడరేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు,సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యం రమేష్,సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి కల్పన, సిఐటియు ఒంగోలు నగర కన్వీనర్ టి మహేష్ ర్యాలీ అగ్ర భాగాన నడిచారు.

**మునిసిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ....**

ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయం నుంచి బయలు దేరిన ప్రదర్శన హెడ్ పోస్టు ఆఫీస్, చర్చి సెంటర్, మిరియాల పాలెం సెంటర్, మస్తాన్ దర్గా, పాత మార్కెట్, బాపూజీ మార్కెట్, అద్దంకి బస్టాండ్, తులసిరామ్ సెంటర్, బస్టాండ్ నుంచి కొత్త మార్కెట్ సభా స్థలి వరకు చేరుకుంది.

**మెడికల్ రిప్రజంటేటివ్ అసోసియేషన్ స్వాగతం..**

ర్యాలీ కి ఏపీ మెడికల్ రిప్రజంటేటివ్ అసోసియేషన్ చర్చి సెంటర్ వద్ద సంఘీ భావం వ్యక్తం చేస్తూ స్వాగతం పలికారు. కాగా పలు ట్రేడ్ యూనియన్ల నేతలు, కార్మిక ఉద్యోగ సంఘాలు సయితం సంఘీభావం వ్యక్తం చేసాయి..

**ఆకట్టుకున్న కళాప్రదర్శనలు...**

ర్యాలీ లో సోషలిజం కు ప్రతీకగా ముండ్లమూరుకు చెందిన లెనిన్ వేషదారి గాలి వెంకటేశ్వర్లు( యర్రయ్య) ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఒంగోలు కు చెందిన మున్సిపల్ కార్మికుడు అధిక ధరల భూతం వేషం, మరో ముగ్గురు కార్మికులు హిందూ, ముస్లిం, క్రిస్టియన్ వేషంలో మత సామరస్యాన్ని చాటి చెబుతూ ర్యాలీలో నడిచి ప్రత్యేక ఆకర్షణగా నిలవడం విశేషం. ఇదిలా ఉండగా కడప జిల్లాకు చెందిన కంచుపాటి కిషోర్ నాయకత్వంలో శ్రీరాములు, రవి, హరి, పవన్, అభిలాష్, చరణ్, అనిల్, అజయ్, కిరణ్ తదితరులు ప్రదర్శించిన గరడీ( ఫైర్ ప్రదర్శన), అనంతపురం కు చెందిన లక్ష్మి నరసమ్మ, నాగలక్ష్మి, మరియమ్మ, లక్ష్మి నారాయణ, నాగేంద్రం, మల్లేష్, వరలక్ష్మి తదితరులు తీన్ మార్ ప్రదర్శన, నెల్లూరు ఇతర జిల్లాలకు చెందిన కోలాటం, డప్పు ప్రదర్శనలు ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**అలరించిన ప్రజానాట్య మండలి గేయాలు...**

ర్యాలీ బహిరంగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి పొత్తూరి సురేష్, అధ్యక్షులు భూతపాటి పేతురు, ఉపాధ్యక్షులు రాజారమేష్, మల్లెల సుజాత, గౌరవ అధ్యక్షులు ఉబ్బాకోటేశ్వరరావు, సుధాకర్, నగర కార్యదర్శి ఎస్ ఇంద్ర జ్యోతి తదితర కళాకారులు ఆలపించిన అభ్యుదయ గేయాలు అలరించాయి.





## స్పా సెంటర్ పై పోలీసుల దాడి
## ఒక విటుడు, ఇద్దరు మహిళలు అరెస్ట్

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 15)**

నగరంలోని బాలాజీరావుపేట పోలేరమ్మ టెంపుల్ ప్రాంతంలో జిల్లా టాస్క్ ఫోర్స్ పోలీసులు సోనూస్ బ్యూటీ పార్లర్ పై ఉన్న స్పా సెంటర్ పై రైడ్ చేసి ఒక విటుడు ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. అందిన సమాచారం మేరకు బాలాజీ రావు పేటలో బ్యూటీ పార్లర్ అండ్ స్పా పేరుతో మసాజ్ సెంటర్ నిర్వహిస్తూ ఉన్నారు. జిల్లా ఎస్పీ ప్రత్యేక నిఘాతో టాస్క్ పోర్స్ టీం ద్వారా రైట్ చేయించారు. ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఈ స్పా సెంటర్ ను జిల్లా టాస్క్ ఫోర్స్ టీం స్పెషల్ నిఘాతో రైడ్ చేశారు. పులగం పవన్ కుమార్ అనే వ్యక్తి ఈ స్పా సెంటర్ నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. చెడిపోతు సూర్య జిల్లా పరిషత్ కాలనీ సంబంధించిన వ్యక్తి ఇద్దరు మహిళలతో మసాజ్ చేయించుకుంటున్న సమయంలో రైడ్ చేసి పట్టుకున్నారు. ఉషా లక్ష్మి కోల్ కత్తా, నందిని మహబూబ్నగర్ జిల్లాకి చెందిన వారిగా గుర్తించారు. దిశ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ సుధాకర్, డిస్ట్రిక్ట్ టాస్క్ పోర్స్ టీం ఎస్ఐ సుదర్శన్, ఒన్ టౌన్ సిఐ వై నాగరాజు, స్పెషల్ టీం పోలీసులు ఈ తనిఖీల్లో ఉన్నారు.





## మార్కాపురం మున్సిపల్ కమిషనర్‌కు అభినందనలు



**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, నవంబర్ 15)**

మార్కాపురం మునిసిపల్ కమీషనర్ డివిఎస్ నారాయణరావు మొంథా తుపాన్‌లో భాగంగా మార్కాపురం పట్టణము నందు ఎప్పటికప్పుడు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పారిశుద్యం, వాటర్ సప్లై , చెరువు మెయిన్ కాలువ మర్మత్తులు, గుండ్లకమ్మ నందు చిక్కుకున్న గేదలు రక్షించుట, రాత్రి, పగలు చేసిన కృషికి గాను జిల్లా కలెక్టర్ పి రాజాబాబు చేతుల మీదుగా ఉత్తమ అవార్డ్ అందుకున్న మునిసిపల్ కమీషనర్‌కి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మీరు మరెన్నో అవార్డ్ లను పొందాలని మనస్పూర్తి కోరుకుంటున్నట్లు తెలిపారు.

# స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ఆంధ్ర ప్రదేశ్ ప్రజల జీవనాడి

## ఉప కులపతి ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 15)

ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం నందు స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి ఉపన్యాసం చేస్తూ ఆంధ్రప్రదేశ్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్వర్ణాంధ్ర కార్యక్రమం ఎంతో విశిష్టమైనదని ప్రభుత్వ కార్యాలయంలోనూ ప్రవేటు సంస్థలలోనూ స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమం జరుపుటవలన ఆ సంస్థలలో పనిచేస్తున్న సిబ్బందికి మానసిక ఉల్లాసము ఉత్సాహంతో పాటు సమాజం మీద మంచి దృక్పథం ఏర్పడుతుందని వాతావరణ కాపాడుతుందని ఇది ఒక మంచి వేదిక అని ఇది ఆంధ్రప్రదేశ్ జీవనాడి అని నిరంతర ప్రక్రియని పేర్కొన్నారు. మరో విశిష్ట అతిథి విశ్వ విద్యాలయం రిజిస్టర్ డాక్టర్ హరిబాబు మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛందర కార్యక్రమం విద్యార్థులలో నాయకత్వం లక్షణాలు పెంపొందించడంతోపాటు పర్సనల్ డెవలప్మెంట్ చేసుకోవడానికి మరియు విద్యార్థిలకు సమాజం పట్ల బాధ్యత మరియు సమాజం పై అవగాహన రాష్ట్రంలో పరిసరాల స్వచ్ఛత మరియు పరిసరాల పరిరక్షణకు కావలసినటువంటి సామాజిక బాధ్యత ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రత్యేక అతిథి ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నిర్మలమణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతినెల నాలుగో శనివారం స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. చేతులు శుభ్రపరచుకోవడం మురికి కాలువలు బాగు చేయడం, మొదలు కార్యక్రమంలు విశ్వవిద్యాలయంలో చేస్తున్నామని ప్రతి విద్యార్థి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పర్యావరణాన్ని కాపాడుతూ భవిష్యత్తు తరాలకు ఆదర్శవంతంగా ఉండాలని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మండే హర్ష ప్రీతం దేవ్ కుమార్ అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ ప్రపంచవ్యాప్తంగా భూమి, నీరు, గాలి కలుషితమవుతుందన్నారు. దీనికి కారణం మానవుడైనని ఓజోన్ పొరను మనం కాపాడుకోవాలని ప్లాస్టిక్ నివారించుకోవాలని కాపాడుకుంటామని ప్రతి మానవుడు మనుగడ సాగిస్తూ ముందుకు సాగాలని ముందు తరాలకు మంచి భవిష్యత్తును అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ ప్రొఫెసర్ జి రాజమోహన్, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జి సోమశేఖర్, ఆక్వా కల్చర్ డిపార్ట్మెంట్ అధ్యాపక సిబ్బంది, అధ్యాపకేతర సిబ్బంది, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఎంపిడిఓ శ్రీనివాసరావు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, నవంబర్ 15)

ప్రతి ఒక్కరూ తమ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ శ్రీనివాసరావు సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు "పచ్చదనపు గ్రామం పరిశుభ్ర గ్రామం" కార్యక్రమంలో భాగంగా జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలను పచ్చదనంతో పాటు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనానికి దోహదపడుతున్నారు. గ్రామాలలో పరిసరాలను ఎప్పటికి ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకునేందుకు స్వయం సహాయక సంఘాల సహకారం తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం కే గోపాలకృష్ణ, టివోటి ప్రసన్న, పంచాయతీ కార్యదర్శులు, వివోఏలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, సిఆర్పిలు, పాల్గొన్నారు.

# పొగాకు గూడెంను ప్రారంభించిన డాక్టర్ మన్నే రవీంద్ర



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, నవంబర్ 15)

యర్రగొండపాలెం మండలంలోని అయ్యాంబోట్లపల్లి గ్రామ సమీపంలో ని తెలుగుదేశం పార్టీ మాజీ మండల కన్వీనర్ వడ్లమూడి లింగయ్య పొగాకు గూడెం కేంద్రాన్ని మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ డాక్టర్ మన్నె రవీంద్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరి ఆంజనేయులు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు వడ్లమూడి లింగయ్య, ఊట్ల సీతయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు గుత్తా మూర్తేయ్యా, తదితరులు పాల్గొన్నారు.

# అచ్యుత్‌రెడ్డి మృతిపై స్పందించిన మంత్రి నారా లోకేష్



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, నవంబర్ 15)

తెలుగుదేశం పార్టీ యువ సైనికుడు యర్రగొండపాలెం నియోజకవర్గంలోని చిన్న దోర్నాలకు చెందిన అన్నపురెడ్డి అచ్యుత రెడ్డి బ్రెయిన్ స్ట్రోక్ తో మృతి చెందారని తెలిసి షాక్‌కి గురయ్యానని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీనే ప్రాణంగా భావించిన తమ్ముడు అచ్యుత్‌కు అశ్రు నివాళు లర్పిస్తున్నాను. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా, ఎక్కడ, ఏ కార్యక్రమం నిర్వహించినా తప్పనిసరిగా కనిపించే మన అచ్యుత్ హఠాన్మరణం చాలా బాధాకరం. ఈ కష్ట సమయంలో అచ్యుత్ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన తెలిపారు.




# దళితుడి హత్య కేసులో కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం భార్యకు ఎస్సీ, ఎస్టీ పెన్షన్

## దళిత హక్కుల నేత నీలం నాగేంద్రరావు చొరవతో మంజూరు చేసిన జిల్లా కలెక్టర్




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, నవంబర్ 15)

ఒంగోలు శివారులో 2023 ఆగస్టులో జరిగిన దళితుడు మొలతోటి వెంకటరావు హత్య కేసులో, హతుడి కుమారుడు నరహరికి ప్రభుత్వ ఉద్యోగం, భార్య మాధవికి ఎస్సీ, ఎస్టీ మంత్లి పెన్షన్ మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు శనివారం తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో మరోతోటి వెంకట్రావు హత్య కేసు పూర్వాపరాలను మీడియాకు తెలిపారు. నాగులుప్పలపాడు మండలం చదలవాడ సమీపంలోని కేసినేని వారి పాలెం మాల కులస్తుడు మొలతోటి వెంకట్రావు బేల్దారి పనులు చేసేవాడన్నారు. కుటుంబ గొడవల్లో భార్య మీద అలిగి, ఒంగోలు కలెక్టరేట్ పక్కన ఉన్న నిరాశ్రయుల మధ్య జీవించాడన్నారు. బాపట్ల చాకలి పాలేనికి చెందిన షేక్ సుభాని వెంకట్రావుకు కలెక్టరేట్ వందే పరిచయం అయ్యాడన్నారు. 2023 ఆగస్టులో పెళ్లూరు సమీపంలోని నారాచి రెస్టారెంట్లో వంట పాత్రలు దొంగతనం చేశారనే అనుమానంతో, రెస్టారెంట్ నిర్వాహకులు సిబ్బంది వెంకటరావు, సుభానిలను తీవ్రంగా కొట్టారన్నారు. వెంకట్రావు మరణించడంతో, శవాన్ని చిల్ల చెట్లలో విసిరివేశారన్నారు. వెంకట్రావు పక్కన ఉన్న సుభాని మీద వెంకట్రావు హత్య కేసు బనాయించాలని చూశారన్నారు. దొంగ సొమ్ము పంచుకునే క్రమంలో గొడవపడి పరస్పరం కొట్టుకున్నారని, ఈ గొడవలో వెంకట్రావు మరణించాడని ఖాకీ కథ అల్లారన్నారు. హైదరాబాదులో ఉన్న తాను, హత్య విషయం తెలిసి, బాధితులకు అండగా మాల మహానాడు ఇతర సంఘాల నాయకులను పంపించానన్నారు. తాను కూడా పోలీసు అధికారులతో మాట్లాడాను అన్నారు. వెంటనే బయలుదేరి ఒంగోలు బాధితులకు అండగా నిలిచానన్నారు. తాను జోక్యం చేసుకోకుండా ఉంటే, పోలీసులు సుభానిపై తప్పుడు కేసు పెట్టి, అప్పటి అధికార వైసిపి పార్టీ నాయకులైన నారాచి యాజమాన్యాన్ని కాపాడేవారన్నారు. తాను జోక్యం చేసుకోవడం వల్ల, సుభాని సాక్షి అయ్యాడని, ఒరిస్సా బీహార్ కు చెందిన సిబ్బంది, స్థానికులు హత్య కేసులో నిందితులు అయ్యారన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా దళితులపై దాడులు హత్యలు సర్వసాధారణమని, అవి జరిగినప్పుడు దళిత సంఘాలు అలర్ట్ గా లేకపోతే కేసు తలకిందులు అవుతుందని నాగేంద్ర చెప్పుకొచ్చారు. 2024లో హతుడు వెంకటరావు భార్య మాధవికి 8 లక్షల 25 వేల రూపాయల రిలీఫ్ ఇప్పించానన్నారు. వెంకట్రావు కుమారుడు నరహరి మైనర్ కావడంతో పాటు, నాగులుప్పలపాడు తహసిల్దార్ నిర్లక్ష్యం కారణంగా రిపోర్టు ఆలస్యమైందన్నారు. మొలతోటి నరహరికి ప్రభుత్వ ఉద్యోగం, మొలతోటి మాధవికి జీవితాంతం ప్రతినెలా డిఎతో కూడిన 5 వేల రూపాయల ఎస్సీ ఎస్టీ స్పెషల్ మంత్లీ పెన్షన్ను మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ రాజా బాబు ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

# బద్వేల్‌లో ప్రజా దర్బార్ నిర్వహించిన టీడీపీ ఇన్చార్జ్ రితేష్ రెడ్డి





(షణ్ముఖ వెలుగు, బద్వేల్, నవంబర్ 15)

ప్రజా సమస్యల పరిష్కార వేదికగా కూటమి నాయకులు ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నారు. బద్వేల్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం టీడీపీ ఇన్‌చార్జ్ రితేష్‌రెడ్డి ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు తమ సమస్యలను తెలిపేందుకు బద్వేల్ తెలుగుదేశం పార్టీ కార్యాలయనికి తరలివచ్చారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో రాసిఇచ్చి ఇంచార్జ్ రితేష్‌రెడ్డికి వివరించారు. అర్జీలను స్వీకరించిన రితిష్‌రెడ్డి కొన్ని సమస్యలను అక్కడికక్కడే సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి పరిష్కరించారు. మరి కొన్ని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బారు కార్యక్రమాలు నిర్వహించ బడుతుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజల ఆకాంక్షల నెరవేరుతున్నాయన్నారు.

# మాచర్ల అర్బన్ పోలీస్ స్టేషన్ పరిసరాల్లో శుభ్రత కార్యక్రమం



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, నవంబర్ 15)

మాచర్ల పట్టణంలో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అర్బన్ సీఐ టి. వెంకటరమణ ఆధ్వర్యంలో శనివారం పోలీసులు భారీ స్థాయిలో శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ స్టేషన్ ప్రాంగణం, చుట్టుపక్కల రహదారులు, పార్కింగ్ ప్రదేశాలను సిబ్బంది స్వచ్ఛందంగా శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన అర్బన్ సీఐ టి. వెంకటరమణ స్వచ్ఛత అంటే ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి బాధ్యత. మాచర్ల పట్టణం శుభ్రంగా, పర్యావరణహితంగా ఉండేందుకు మా పోలీస్ శాఖ ముందుండి ఆదర్శంగా నిలుస్తోంది. శుభ్రతతో ఆరోగ్యం, ఆరోగ్యంతో అభివృద్ధి వస్తుంది. ప్రజలంతా కూడా తమ ఇళ్ల పరిసరాలు, కాలనీలు శుభ్రంగా ఉంచేందుకు ముందుకు రావాలి అని ఆయన తెలిపారు. సిబ్బందితో కలిసి స్వయంగా శుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న సీఐ, ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని, చెత్తను నిర్ణీత ప్రదేశాల్లో వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో ఎస్.ఐ లు వెంకట రావు, అనంతకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్ ఎస్ కు నివాళులర్పించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, నవంబర్ 15)

ప్రముఖ పారిశ్రామికవేత్త ,సేవా తత్పరులు, విద్యా సంస్థల ఏర్పాటు చేసిన నాదెండ్ల సుబ్రహ్మణ్యం భౌతిక ఖాయానికి మార్కాపురంలోని వారి స్వగృహం వద్ద శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ ఇమ్రాన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్మెంట్ ప్రధాన కార్యదర్శి షేక్ మహబూలీ, మార్కాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు సురేష్, సామ్యూల్, తర్లపాడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ హుస్సేన్, మార్కాపూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇమ్రాన్, అల్తాఫ్, సుభాని తదితరులు పాల్గొన్నారు.